శనివారం 18, అక్టోబర్ 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం




సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

సంక్షేమమంటే సాయమే కాదు..

## ఆత్మగౌరవాన్ని నిలపటం కూడా

- సీఎం చంద్రబాబు ట్వీట్

4



కర్నూలు సభనుంచి

## మంచి మెసేజ్ వెళ్లింది

- మంత్రులతో చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు
- గ్రాండ్ సక్సెస్ చేసిన అందరికీ అభినందనలు

3

# వడ్డెర్లకు మైనింగ్ లీజుల కోటా





- తగిన ప్రభుత్వ విధానాన్ని రూపొందించండి
- రాష్ట్రంలో ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం
- మైనింగ్‌లో శాటిలైట్, డ్రోన్ చిత్రాల ద్వారా విశ్లేషణ
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం
- గనులు, ఉచిత ఇసుక విధానంపై సమీక్ష

2



## భవిష్యత్తును మార్చేది సంస్కరణలే

- విద్యార్థులకు సీఎం చంద్రబాబు సూచన
- సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ క్యాంపైన్‌లో విద్యార్థులు
- పోటీలలో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు అందజేత

2

## సొంత భవనం నుంచి సీఆర్‌డీఏ విధులు

- సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్

3

## ప్రపంచ పటంపై విశాఖ!

ఆనందిస్తున్నానన్న సీఎం చంద్రబాబు

3

# శనగ రైతులకు అండగా ఉంటాం



- రబీ సీజన్‌లో సబ్సిడీపై విత్తనాలు అందిస్తాం
- రైతు ప్రయోజనాలకే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

3

# నా వ్యాఖ్యలు వక్రీకరించారు

- కట్ పేస్ట్ చేసి తప్పుడు ప్రచారం
- పిఠాపురంలో సమస్యలు జీరో చేశామంటే.. వర్మను జీరో చేశామని మార్చారు
- మంత్రి నారాయణ స్పష్టీకరణ

4



## వేగంగా ఎన్డీబీ రహదారుల పనులు



- కాంట్రాక్టర్లకు త్వరితగతిన బిల్లులు చెల్లిస్తాం
- నాణ్యతలో రాజీపడొద్దు
- సమీక్షా సమావేశంలో మంత్రి జనార్దన్ రెడ్డి ఆదేశం
- వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపిన కాంట్రాక్టర్లు

3

## అవినీతి, అక్రమాలకు మరోపేరు జోగి

- ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మండిపాటు
- నకిలీ మద్యం కుంభకోణంలో నిందితులందరూ జైలుకు వెళ్లడం ఖాయం
- తప్పుచేసి కులాలను రెచ్చగొట్టే మాటలా?
- ఐదేళ్లపాటు పెడన నియోజకవర్గాన్ని దోచుకున్న దొంగ

7

పోలవరం నిర్వాసితులకు

## కూటమి ప్రభుత్వ దీపావళి కానుక

- పునరావాసానికి రూ.1100 కోట్లు
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రాజెక్ట్ పరుగులు
- జగన్ హయాంలో అంతులేని విధ్వంసం
- ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

5

## జోగి, పేర్ని తీరు జుగుప్సాకరం

- బూతులతో కృష్ణాజిల్లాకు తలవొంపులు
- అన్నం బదులు గడ్డి తింటున్నారేమో?
- తప్పుచేసిన జోగి తప్పించుకునేందుకు కులం కార్డు
- గతంలో మంత్రి పదవికోసం చంద్రబాబు ఇంటిపై దాడి
- దమ్ముంటే ఇప్పుడు గేటును తాకి చూడండి
- ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధ్వజం

6

విద్యార్థులను

## కన్నబిడ్డల్లా చూసుకోండి..

- అధికారులకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశం
- వారానికోసారి ఆరోగ్య పరీక్షలు
- హాస్టళ్లలో పరిశుభ్రత తప్పనిసరి
- డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లతో మంత్రి జూమ్ కాన్ఫరెన్స్

5

# వడ్డెర్లకు మైనింగ్ లీజుల కోటా

- తగిన ప్రభుత్వ విధానాన్ని రూపొందించండి
- రాష్ట్రంలో ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం
- మైనింగ్‌లో శాటిలైట్, డ్రోన్ చిత్రాల ద్వారా విశ్లేషణ
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశం
- గనులు, ఉచిత ఇసుక విధానంపై సమీక్ష



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలో లభ్యమవుతున్న ఖనిజాల విలువపై సమగ్ర అధ్యయనం జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గనుల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఖనిజాలకు విలువ జోడింపుతోనే అదనపు ఆదాయం వస్తుందని సీఎం సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో గనుల శాఖ, ఉచిత ఇసుక విధానంపై సీఎం సమీక్ష నిర్వహించారు. మేజర్, మైనర్ మినరల్స్ ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.3320 కోట్ల ఆదాయార్జనను లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గతంతో పోలిస్తే 34శాతంమేర అదనంగా గనుల శాఖనుంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మాంగనీస్‌లాంటి మేజర్ ఖనిజాల ఉత్పత్తిలో 72 శాతానికిపైగా ఆదాయం వస్తోందని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం ఏపీలో ఉన్న మినరల్ వెల్త్ విలువను అంచనా వేయాలని సూచించారు. ఒడిశాలాంటి రాష్ట్రాల్లో వాల్యూ ఎడిషన్ ద్వారా ఎక్కువగా ఆదాయాన్ని పొందుతున్నారని.. రూ.50 వేల కోట్ల ఆదాయం ఖనిజాలనుంచే వస్తోందని సీఎం తెలిపారు. ఏపీలోనూ అందుకు తగిన విజన్ ప్లాన్ తయారు చేసి విలువ జోడిస్తే రూ.20-30 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి అన్నారు. పెండింగ్‌లోవున్న 6500 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.

### వడ్డెర్లకు మైనింగ్ లీజులు.. మార్గదర్శకాలు రూపొందించండి

వడ్డెర్లకు మైనింగ్ లీజుల కేటాయింపు అంశంపై పాలసీని తయారు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. వడ్డెర్లు, సొసైటీలకు 15శాతంమేర గనుల్లో రిజర్వేషన్ కల్పించే అంశాన్ని వచ్చే కేబినెట్‌లో చర్చించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వెనుకబడిన వర్గాలైన వడ్డెర్లకు ఆర్థిక ప్రయోజనాలు కలిగేలా లీజు కేటాయింపు విధానాన్ని రూపొందించాలని సీఎం స్పష్టంచేశారు. సీనరేజి, ప్రీమియం మొత్తాల్లో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఆదేశించారు. మైనింగ్ లీజుల కేటాయింపుతోపాటు వారు ఎంఎస్‌ఎంఈలుగా ఎదిగేందుకూ ప్రస్తుతమున్న పాలసీని అనుసంధానించాలన్నారు. రాష్ట్రంలో గనుల తవ్వకాలకు సంబంధించి శాటిలైట్ చిత్రాలు, డ్రోన్ ఆధారిత టెక్నాలజీతో విశ్లేషించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇచ్చిన పర్మిట్లు, జరిగిన తవ్వకాలు ఎంత అనేది ఎప్పటికప్పుడు విశ్లేషించాలన్నారు. అనలటిక్స్‌ను వినియోగించుకుని జరిగిన తవ్వకాలను అంచనా వేయాలన్నారు.

బీచ్ శాండ్ మినరల్స్‌లాంటి భార ఖనిజాల మైనింగ్‌తోపాటు విలువ జోడింపు ద్వారా అధిక ఆదాయం సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అలాగే కడపలో నిర్మించనున్న స్టీల్ ప్లాంట్‌కు ముడి ఇనుము ఖనిజం సరఫరాపైనా అధ్యయనం చేయాలని సూచించారు.

### ఉచిత ఇసుకతో ప్రజలకే ప్రయోజనం దక్కాలి

ప్రభుత్వం అమలు చేస్తోన్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రజలందరికీ ప్రయోజనం కలగాలని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఉచిత ఇసుక సరఫరాను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వ్యవస్థలో ఉన్న లోపాలను వినియోగించుకుని దుర్వినియోగం చేసే అవకాశం లేకుండా నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సీజన్ కోసం 66.5 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను నిల్వ చేశామని.. ప్రస్తుతం అన్ని స్టాక్ పాయింట్లలోనూ 43 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ చిట్టచివరి వ్యక్తికీ ప్రయోజనం దక్కేలా ఇసుక లభ్యత జరగాలన్నారు. ఇసుక లోడింగ్‌తోపాటు రవాణాకు అతితక్కువ వ్యయం అయ్యేలా చూడాలని సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉచిత ఇసుక లభ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల్లోని అన్ని రూట్లలో పెట్టిన సీసీ కెమెరాల నిఘాను మరింత పటిష్టం చేయాలని సీఎం సూచించారు. ఆర్టీజీఎస్ ద్వారా ఉచిత పంపిణీ విధానంపై పర్యవేక్షించాలని సీఎం అన్నారు. సమీక్షకు గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆ శాఖ ఉన్నతాధికారులు ముఖేష్ కుమార్ మీనా, ప్రవీణ్ కుమార్, ఆర్టీజీఎస్ అధికారులు హాజరయ్యారు.

# భవిష్యత్తును మార్చేది సంస్కరణలే

- విద్యార్థులకు సీఎం చంద్రబాబు సూచన
- సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ క్యాంపైన్‌లో విద్యార్థులు
- పోటీలలో గెలుపొందిన విజేతలకు సర్టిఫికెట్లు అందజేత





అమరావతి (చైతన్య రథం): భవిష్యత్తును మార్చేది సంస్కరణలేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా.. సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జీఎస్టీ సంస్కరణలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' ప్రచారంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లోని విజేతలు శుక్రవారం ముఖ్యమంత్రిని రాష్ట్ర సచివాలయంలో కలిశారు. 13 ఉమ్మడి జిల్లాలకు చెందిన 17మంది విద్యార్థినీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలకు సీఎం చంద్రబాబు సర్టిఫికెట్లు అందించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన జీఎస్టీ సంస్కరణలవల్ల కలిగే ప్రయోజనాలను అర్థం చేసు కున్నారా..? అని వారిని సీఎం అడిగారు. నిత్యావస రాల్లోని చాలా వస్తువులు సున్నాశాతం, 5 శాతం స్లాబ్ పరిధిలోకి వస్తున్నాయని.. దీనివల్ల చాలా వరకు ధరలు తగ్గుతాయని విద్యార్థులు చెప్పారు. నాటిన కొంత కాలానికి చెట్టు ఫలాలు ఇస్తున్నట్టు... సంస్కర ణలను ఇప్పుడు అమలుచేస్తే కొన్ని రోజుల తర్వాత ఆ ఫలితాలు ప్రజలకుఅందుతాయని సీఎం వివరించారు. జీఎస్టీ వంటి సంస్కరణలను అర్థం చేసుకుని వాటిపై ఎస్సే రైటింగ్ కాంపిటీషన్లు, పెయింటింగ్, ఉపన్యాస పోటీల్లో పాల్గొనడం... వాటిల్లో విజేతలుగా నిలవడం అభినందించదగ్గ విషయమని ముఖ్యమంత్రి విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యాశాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# కర్నూలు సభనుంచి మంచి మెసేజ్ వెళ్లింది

**మంత్రులతో చిట్‌చాట్‌లో సీఎం చంద్రబాబు - గ్రాండ్ సక్సెస్ చేసిన అందరికీ అభినందనలు**



అమరావతి (చైతన్య రథం): ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటన విజయవంతం కావడంపై మంత్రులు, వివిధ శాఖల అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రధాని ఏపీలో నాలుగోసారి జరిపిన పర్యటనలో కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారని... వీటిల్లో కర్నూలులో నిర్వహించిన సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ బహిరంగ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని సీఎం అన్నారు.

సభ మంచి మెసేజ్ ఇచ్చిందని సీఎం ప్రస్తావించారు. మంత్రులు, ఉన్నతాధికారులతో చిట్‌చాట్‌లో భాగంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేశారని అభినందించారు. ప్రధాని సైతం పర్యటనను ఎంతో ఆస్వాదించారని అంటూ.. శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనంపై ప్రధాని ఎంతో సంతృప్తిని, సంతోషాన్ని వ్యక్తం చేశారని సీఎం వివరించారు. ప్రధాని మోదీ సైతం సూపర్ జీఎస్టీ కార్యక్రమాలను అభినందించారని సీఎం చెప్పారు. జీఎస్టీపై నెలపాటు సాగించిన ప్రచార కార్యక్రమాలపై సమగ్రంగా ఒక పుస్తకాన్ని ప్రచురించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

## సొంత భవనం నుంచి సీఆర్‌డీఏ విధులు

**సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్**

అమరావతి (చైతన్య రథం): ఏపీసీఆర్‌డీఏ తన సొంతభవనం నుంచి తనవిధ్యుక్తధర్మ నిర్వహణకు సన్నద్ధమైందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "ఏపీసీఆర్‌డీఏ కార్యాలయం ఇప్పుడు పనిచేస్తోంది. ఈ అత్యాధునిక ఏడంతస్తుల భవన సముదాయం నుండి అన్ని మూలధన ప్రణాళిక, నిర్మాణం మరియు పట్టణాభివృద్ధి కార్యకలాపాలు ఇప్పుడు ఒకే పైకప్పునుంచి నిర్వహించబడతాయి. రాజధాని ప్రాంత ప్రాధికార సంస్థ సమర్థత, జవాబుదారీ తనం, సమయపాలన పద్ధతిలో పనిచేయగలదని హామీ ఇస్తున్నా. అమరావతి ఇంజిన్ రూం ఇప్పుడు మన కళ్లముందు అందుబాటులో ఉంది' అని పేర్కొన్నారు.




## ప్రపంచ పటంపై విశాఖ!

## ఆనందిస్తున్నానన్న సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్య రథం): 15వేల బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడితో విశాఖ కేంద్రంగా గూగుల్ ఏఐ హబ్ నెలకొల్పుతోన్న కథనం అంతర్జాతీయ పత్రికలలో చోటుచేసుకోవడం ఆనందంగా ఉందని సీఎం చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "అంతర్జాతీయ ప్రచురణ వాల్ స్ట్రీట్ జర్నల్‌లో విశాఖపట్నం పేరు చూసినపుడు చెప్పలేనంత సంతోషం కలిగింది.

ఏపీలోని విశాఖ కేంద్రంగా గూగుల్ సంస్థ 15 బిలియన్ల పెట్టుబడితో డేటా హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు సంస్థ ప్రమరించిన కథనం సారాంశం. టెక్నాలజీ పెట్టుబడుల కోసం వైజాగ్ ప్రపంచ పటంలోకి ప్రవేశిస్తోందన్న కథనం నాకు చాలా సంతోషాన్నిచ్చింది" అని చంద్రబాబు పేర్కొన్నారు. 'యంగెస్ట్ స్టేట్.. హయ్యస్ట్ ఇన్వెస్ట్‌మెంట్. గూగుల్ కమ్స్ టు ఏపీ' అంటూ చంద్రబాబు ఆసక్తికరమైన టాగ్‌లైన్ ఇచ్చారు.

# వేగంగా ఎన్డీబీ రహదారుల పనులు

- కాంట్రాక్టర్లకు త్వరితగతిన బిల్లులు చెల్లిస్తాం
- నాణ్యతలో రాజీపడొద్దు
- సమీక్షా సమావేశంలో మంత్రి జనార్దన్ రెడ్డి ఆదేశం
- వచ్చే మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపిన కాంట్రాక్టర్లు



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని రహదారులకు తొలి ప్రాధాన్యత ఇస్తామన్నారు. గుంతలు, గోతుల రహిత రహదారుల కల్పనకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విజయవాడ లోని ఈఎన్సీ కార్యాలయంలో ఎన్డీబీ (న్యూ డెవలప్ మెంట్ బ్యాంక్) పనులపై ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం. టీ కృష్ణబాబుతో కలిసి శుక్రవారం మంత్రి సమీక్షించారు.. ఈ సందర్భంగా ఎన్డీబీ పనుల స్థితి గతులపై ఆర్ అండ్ బీ శాఖ అధికారులు, ఎన్డీబీ కాంట్రాక్టర్లతో మంత్రి మాట్లాడారు..

### నాణ్యతలో రాజీవద్దు

ఎన్డీబీ రహదారుల పనులు జాప్యం కావడంతో క్షేత్రస్థాయిలో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు మంత్రి సూచించారు.. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపులు త్వరతగతిన పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తామని, మిగిలిన పనులను కూడా వేగంగా పూర్తి చేయాలని కోరారు. అదే సమయంలో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడవద్దన్నారు. ఎన్డీబీ ప్రాజెక్టు కింద తగ్గించిన పనులకు సంబంధించి కొత్త అంచనా వ్యయంతో కూడిన నివేదికను 15 రోజుల్లో సమర్పిం చాలని అధికారులను ఆదేశించారు. అదే క్రమంలో కాంట్రాక్టర్లకు సంబంధించి బ్యాంకు గ్యారెంటీ విషయంలో వెసులుబాటు కల్పించే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. ఎన్డీబీ రహదారులను కుదించే క్రమంలో వంతెనలు, కల్వర్టులు మినహాయించి కేవలం రహదారుల నిర్మాణం మాత్రమే చేపడితే ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని, అలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

### పనుల్లో వేగం పెంచాలి

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిన ఎన్డీబీ రోడ్ల పనులను కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పట్టాలెక్కించి, కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు దాదాపు రూ. 239 కోట్ల మేర చెల్లించామన్నారు.. అయితే అనంతరం అనివార్య కారణాలతో పనుల్లో వేగం పుంజుకోలేదని తెలిపారు. ఎన్డీబీ రహదారుల పనులకు సంబంధించి రూ. 1680.97 కోట్లతో 85 రోడ్ల పనులను 682 కి.మీ కు కుదించారు. అనంతరం కాంట్రాక్టర్లతో మాట్లాడి నిలిచిన పనులను తిరిగి పట్టాలెక్కించాం. ఇందులో ఇప్పటికే 546 కి.మీ మేర పనులు ప్రారంభించగా, 236 కి.మీ మేర పనులు పూర్తయ్యాయి. రూ. 932.99 కోట్ల మేర పనులు పూర్తి చేశాం. ఫేజ్ 1 కింద ఇప్పటి వరకు ఇప్పటి వరకు దాదాపు 747.98 కోట్ల పనులు పూర్తి చేసి, రూ. 434 కోట్ల మేర నిధులు కాంట్రాక్టర్లకు చెల్లించాం. రూ. 161 కోట్ల బిల్లులు సీఎఫ్ఎంఎస్ కింద ఇప్పటికే అప్ లోడ్ చేశాం. దాదాపు రూ.151 కోట్ల మేర బిల్లులు ఇంకా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. మొత్తంగా ఇప్పటి వరకు 44.49 % మేర పనులు పూర్తి చేశాం. అయితే దాదాపు 6 జిల్లాల్లో 50 శాతం కంటే తక్కువ పనులు మాత్రమే జరిగిన క్రమంలో ఆయా జిల్లాల్లో అధికారులు పనులు వేగం పెంచేందుకు మరింత దృష్టిసారించాలని మంత్రి ఆదేశించారు.

### త్వరలోనే పెండింగ్ బిల్లుల చెల్లింపు

ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ.. మార్చి 2026 లోపు ఎన్డీబీ రోడ్లకు సంబంధించి పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.. అదే సమయంలో తమ పెండింగ్ బిల్లులు త్వరితగతిన అందజేయాలని మంత్రికి విన్నవించారు. ఎన్డీబీ కాంట్రాక్టర్లకు త్వరలోనే పెండింగ్ బిల్లులు చెల్లించి, ఆయా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సహకరిస్తామని మంత్రి తెలిపారు. రహదారుల అభివృద్ధిలో దీర్ఘకాలంగా అభివృద్ధికి నోచుకోని రహదారులకు ప్రాధాన్యత కల్పించాలని అధికారులకు మంత్రి సూచించారు.. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనుల్లో... గతంలో ఎన్డీబీ, సీఆర్ఐఎఫ్ కింద రద్దయిన 650 కి.మీ పనులకు అత్యంత ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి చేయాల్సిన ఆవశ్యకతను మంత్రి నొక్కిచెప్పారు. ప్రస్తుతం వర్షాకాలం సీజన్ ముగిసిన క్రమంలో రహదారులు మరమ్మతులు, అభివృద్ధి పనులు వేగవంతం చేయాల్సిన అవసరాన్ని మంత్రికి అధికారులు తెలియజేశారు. మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశంలో ఆర్ అండ్ బి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, ఎం.టి కృష్ణబాబు, చీఫ్ ఇంజనీర్లు శేషు కుమార్, విజయశ్రీ, తదితర ఉన్నతాధికారులు, ఎన్డీబీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు..

# శనగ రైతులకు అండగా ఉంటాం




- రబీ సీజన్‌లో సబ్సిడీపై విత్తనాలు అందిస్తాం
- రైతు ప్రయోజనాలే కూటమి ప్రభుత్వానికి ప్రాధాన్యం
- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడి

అమరావతి (చైతన్యరథం): రబీ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా శనగ పంట సాగుచేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి అచ్చెన్నాయుడు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఎంత ఇబ్బందికరంగా ఉన్నా రైతుల ప్రయోజనాల విషయంలో కూటమి ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కితగ్గదని స్పష్టం చేశారు. రైతు అభ్యున్నతే మా లక్ష్యం. ప్రతి రైతు అవసరాలను గుర్తించి, వారికి అవసరమైన విత్తనాలు సమయానికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించేందుకు వ్యవసాయ శాఖ ఇప్పటికే జిల్లాల వారీగా అంచనాలు రూపొందిస్తోందని. రైతుల అవసరాలకు సరిపడే విత్తనాలు అందుబాటులో ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. రైతు కష్టపడి పండించే ప్రతి గింజ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలమవుతుంది. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. రైతు కోసం కొత్త ఆలోచనలు, సాంకేతికతను ఉపయోగించి వ్యవ సాయాన్ని లాభదాయకంగా మార్చాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా దిశానిర్దేశం చేశారు.రైతు ఆదాయాన్ని పెంచే ప్రతి కార్యక్రమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

## సంక్షేమమంటే సాయమే కాదు..
# ఆత్మగౌరవాన్ని నిలపటం కూడా
### ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్

అమరావతి (చైతన్య రథం): పేదరిక నిర్మూలన అంటే.. నిరుపేద వర్గాలకు ఆర్థిక సాయం అందించడమే కాదు.. వారి ఆత్మగౌరవాన్ని ఇనుమడింప చేయడమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా ఎక్స్ వేదికపై పోస్టు పెడుతూ.. "పేదరిక నిర్మూలన అంటే.. నిరుపేదలు ఎదగడానికి అవకాశాలను కల్పించడం. అందరితో సమానంగా వారిని ముందుకు నడిపించడం. స్వర్ణాంధ్ర విజన్ 2047లోని ప్రధాన లక్ష్యం పేదరిక నిర్మూలన. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కూటమి ప్రభుత్వం మొదటి రోజు నుంచీ పనిచేస్తోంది. 16 నెలల్లో లక్ష కోట్ల రూపాయలకు మించిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. దేశంలో ఎక్కడా లేనివిధంగా నెలనెలా రూ.2,758 కోట్లతో 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లు' అందిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా 207 'అన్న క్యాంటీన్లు' పునఃప్రారంభించి రూ.5కే పేదల ఆకలి తీరుస్తున్నాం. 'దీపం 2.0' పథకంతో పేదింటి మహిళలకు ఏడాదికి 3 ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం. పేదింటి పిల్లలు చదువుకుని వృద్ధిలోకి రావాలన్న లక్ష్యంతో ఇంట్లో ఎంతమంది చదువుతుంటే అంతమందికి 'తల్లికి వందనం' కింద ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ప్రతి మహిళకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాం. రైతులకు 'అన్నదాత సుఖీభవ' పథకం కింద మొదటి విడతగా రూ.7,000లు జమచేశాం. 'మత్స్యకారుల సేవలో' పథకం కింద రూ.246 కోట్లు, ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం కింద రూ.435 కోట్లు ఇచ్చాం. ఇలా సంక్షేమ పథకాలు ఇస్తూనే పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఎంచుకున్న మార్గమే 'పి-4 జీరో పావర్టీ' కార్యక్రమం. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం సందర్భంగా ఈ లక్ష్యానికి మనందరం పునరంకితమవుదాం అని పిలుపునిస్తూ... పి-4 కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను" అని పేర్కొన్నారు.

# విద్యార్థులకు మెరుగైన వైద్యం





- అధికారులకు మంత్రి సంధ్యారాణి ఆదేశం
- సాలూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు పరామర్శ

సాలూరు (చైతన్యరథం): అస్వస్థతకు గురైన గురుకుల విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారుల ను గిరిజన, స్త్రీ,శిశు సంక్షేమశాఖల మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గంలో వివిధ హాస్టళ్ల విద్యార్థులు అనారోగ్యానికి గురికావటంతో మంత్రి శుక్రవారం స్వయంగా వెళ్లి పరిస్థితులను తెలుసుకున్నారు. ఆసుపత్రి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల పరిస్థితి మెరుగ్గానే ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకునే వరకూ మెరుగైన వైద్యం కొనసాగించాలని మంత్రి ఆదేశించారు. విద్యార్థుల పరిస్థితి తనకు ఎప్పటికప్పుడు నివేదించాలన్నారు. చిన్నారులు డిశ్చార్జ్ అయ్యేంత వరకు జాగ్రత్తగా పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. పీహెచ్‌సీ డాక్టర్ల సమ్మె కారణంగా వివిధ ప్రాంతాల నుండి 6 హాస్టళ్ల విద్యార్థులను సాలూరు సీహెచ్‌సీలో చేర్పించారు. ఆ ఆరు హాస్టళ్లలో 4 గిరిజన, ఒక సోషల్ వెల్ఫేర్, ఒక కేజీబీవీ హాస్టల్ ఉన్నాయి. విద్యార్థుల అనారోగ్య వార్త తెలుసుకున్న వెంటనే సాలూరు సీహెచ్‌సీకి చేరుకున్న మంత్రి సంధ్యారాణి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మొత్తం 21 మంది విద్యార్థులను మంత్రి స్వయంగా పరామర్శించారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు జాండీస్ (పసుపు జ్వర లక్షణాలతో) ఒక విద్యార్థి మలేరియాతో బాధపడుతున్నారు. మిగిలిన విద్యార్థులు సాధారణ జ్వరం, అలసట వంటి తేలికపాటి సమస్యలతో ఉన్నారని వైద్యులు వివరించారు. జాండీస్, మలేరియా బాధిత విద్యార్థులకు తక్షణ వైద్య సాయం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలో విద్యార్థులను స్వయంగా పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెబుతూ, ప్రభుత్వం మీ ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ చూపిస్తుంది. అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు సమయానికి అందేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా హాస్టళ్లలో ఆహారం నాణ్యత, తాగునీరు, పరిశుభ్రత, పాఠశాల పరిసరాలలో వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే అంశాలపై పూర్తిస్థాయి సమీక్ష చేయాలని అధికారులను ఆదేశించారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో మాట్లాడిన మంత్రి విద్యార్థుల ఆరోగ్యానికి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పిల్లలు త్వరగా కోలుకొని తిరిగి పాఠశాలలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# నా వ్యాఖ్యలు వక్రీకరించారు

- కట్ పేస్ట్ చేసి తప్పుడు ప్రచారం
- పిఠాపురంలో సమస్యలు జీరో చేశామంటే.. వర్మను జీరో చేశామని మార్చారు
- మంత్రి నారాయణ స్పష్టీకరణ





విశాఖపట్నం (చైతన్యరథం): ఎన్డీఏలో పార్టీలన్నీ కలిసే ఉన్నాయని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మను జీరో చేశామనే వ్యాఖ్యలపై మంత్రి నారాయణ స్పష్టత ఇచ్చారు. తన మాటల్ని కట్ పేస్ట్ చేసి తప్పుగా ప్రచారం చేస్తున్నారన్నారు. శుక్ర వారం విశాఖపట్నంలో మంత్రి నారా యణను వర్మ కలిశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. టెలీ కాన్ఫరెన్స్‌లో నేను మాట్లాడిన మాటలను కట్ పేస్ట్ చేసి సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. నెల్లూరు నాయకులతో మాట్లాడుతూ పిఠాపురంలో ఉన్న సమస్యలను ప్రస్తావించాను. పిఠాపురంలో జనసేన, టీడీపీ ద్వితీయ శ్రేణి మధ్య ఉన్న విభేదాలను చర్చించి'జీరో' చేశామని నేను చెప్పాను. పిఠాపురంలో సమస్యలు జీరో చేశామంటే.. వర్మను జీరో చేశామని మార్చారు. నా వ్యాఖ్యలు వక్రీకరించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. కంటెంట్ మొత్తం బహిర్గతం చేసి ఉంటే వక్రీకరణలు ఎలా జరిగాయో అర్థం అయ్యేది. వక్రీకరించి విభేదాలు సృష్టించడం ఎవరి వల్ల కాదు. ఎన్డీఏ కూటమి చాలా స్ట్రాంగ్‌గా ఉంది. ఇండిపెండెంట్‌గా 50 వేల ఓట్లతో గెలిచిన బలమైన నాయకుడు వర్మ. పిఠాపురంలో జనసేన, టీడీపీ సమన్వయంతో కలిసి పనిచేస్తున్నాయన్నారు.

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ.. నారాయణ వ్యాఖ్యలపై అభూత కల్పనలు ప్రచారం చేశారన్నారు. పేటీఎం బ్యాచ్ చేసే అసత్య ప్రచారాలను తాను పట్టించుకోనని స్పష్టం చేశారు. జనసేన, టీడీపీ మధ్య కాకినాడ జిల్లాలో మంత్రి నారాయణ వారధిగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి మధ్య విభేదాలు సృష్టించడం ఎవరి వల్ల కాదని తేల్చి చెప్పారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు లక్ష్యం

- అభివృద్ధి, సంక్షేమ రంగాలపై చిత్తశుద్ధితో ప్రభుత్వం
- పేదలకు వరంలా సీఎంఆర్ఎఫ్
- పీపీపీ విధానంలో మెడికల్ కళాశాలల నిర్మాణం పూర్తి
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి



తూర్పు నాయుడుపాలెం (చైతన్యరథం): రాష్ట్ర ప్రజలు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయం, ఆలోచన అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం, తూర్పు నాయుడుపాలెం లోని తన క్యాంపు కార్యాలయంలో 45మంది లబ్ధిదారులకు రూ.30.14 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) వరంలాంటిదన్నారు. పేదప్రజలు అనారోగ్యం పాలై ఆసుపత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. వారిలో కొండపి నియోజకవర్గ పరిధిలో 45 మందికి 30లక్షల 14 వేల రూపా యలు మంజూరు కాగా, వారికి చెక్కు లను అందజేశామన్నారు. ఇప్పటి వరకు కొండపి నియోజకవర్గంలో 925 మంది లబ్ధిదారులకు 7 కోట్ల 57 లక్షల 64 వేల రూపాయల మేర ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నదన్నారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహిస్తూ పెద్దఎత్తున పెట్టుబడులను తీసుకువస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి పౌరుని ఆరోగ్య పరిస్థితిని డిజిటలైజేషన్ చేసి సంజీవిని పథకం ద్వారా ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తూ 25 లక్షల రూపాయల వరకు ఇన్సూరెన్స్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వస్తున్నట్లు మంత్రి తెలిపారు. పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్ షిప్‌తో వైద్య కళాశాలను త్వరగా పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నామన్నారు. ప్రతి పౌరునికి అవసరమైన వైద్య సేవలను అందించి వైద్య ఖర్చు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి డా.స్వామి తెలిపారు.

## వ్యక్తిగత కారణాలతో జరిగిన హత్యకు..
# కులాల రంగు పులిమి దుష్ప్రచారం



- బాధ్యులపై చట్టపరంగా చర్యలు
- రాళ్లపాడు హత్యపై నెల్లూరు ఎస్పీ

నెల్లూరు (చైతన్యరథం): ఇద్దరు వ్యక్తుల మధ్య వివాదం, ఆర్థికపరమైన కారణాలతో జరిగిన హత్యను కులాలకు ముడిపెడుతూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నెల్లూరు జిల్లా ఎస్పీ అజితా వేజెండ్ల స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం రాళ్లపాడు హత్య ఘటనకు సంబంధించి జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. వ్యక్తిగత కక్షలతో జరిగిన హత్యను కులాలకు ముడిపెట్టడం పై ఎస్పీ తీవ్రంగా స్పందించారు. తప్పుడు ప్రచారం చేసే వారిపై కేసులు పెడతామని హెచ్చరించారు. ఇప్పటికే హత్య ఘటనలో నిందితులు హరిశ్చంద్ర ప్రసాద్, మాధవ రావులను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు వెల్లడించారు. ఇరువురి మధ్య వ్యక్తిగత కారణాలతో పాటు ఆర్థికపరమైన లావాదేవీలు ఈ హత్యకు కారణమని తెలిపారు. వాస్తవాలను కప్పిపెట్టి కులాలకు ముడిపెట్టి రెచ్చగొట్టే విధంగా ప్రభుత్వం పై దుష్ప్రచారం చేయడాన్ని సీరియస్‌గా తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిందితులను జైలుకు పంపిన తర్వాత కూడా వైషమ్యాలు పెంచేలా కొందరు వ్యవహరించడం సరికాదన్నారు. దుష్ప్రచారం చేస్తున్న వ్యక్తులు, సామాజిక మాధ్యమాల పై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ఫేక్ వీడియోలు సృష్టించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నామని వెల్లడించారు.

చైతన్యరథం

# విద్యార్థులను కన్నబిడ్డల్లా చూసుకోండి..

- అధికారులకు బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశం
- వారానికోసారి ఆరోగ్య పరీక్షలు
- హాస్టళ్లలో పరిశుభ్రత తప్పనిసరి
- 'అన్నపర్రు' ఘటనలు పునరావృతం కానివ్వొద్దు
- రాబోయే టెన్త్, ఇంటర్ లో వంద శాతం ఫలితాల రావాల్సిందే
- డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, ప్రిన్సిపాళ్లతో మంత్రి సవిత జూమ్ కాన్ఫరెన్స్



అమరావతి (చైతన్యరథం): బీసీ హాస్టళ్లు, ఎంజేపీ స్కూళ్లలో చదివే విద్యార్థులను కంటికి రెప్పల్లా, సొంత బిడ్డల్లా చూసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. కురుస్తున్న వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, వారానికోసారి సమీపంలో ఉన్న పీహెచ్సీ వైద్యులతో పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు ప్రతి రోజూ హాస్టళ్లను సందర్శించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీ హాస్టళ్ల వార్డెన్లు, ఎంజేపీ స్కూళ్ల ప్రిన్సిపాళ్లతో మంత్రి సవిత శుక్రవారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. హాస్టళ్లలో పారిశుధ్యంపై తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే ఇవ్వాలన్నారు. వసతి గృహాల పరిసరాలను, మరుగుదొడ్లు, బాత్ రూమ్‌లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. హాస్టళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, దోమలు వ్యాప్తి చెందకుండా స్థానిక సంస్థల సాయంతో ఫాగింగ్ చేయించాలని మంత్రి సవిత ఆదేశించారు.

**దురదృష్టకర ఘటనలకు తావివ్వొద్దు**

ప్రస్తుతం రాష్ట్రంలో కొన్న సంక్షేమ హాస్టళ్లలో దురదృష్టకర సంఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మంత్రి సవిత దిశా నిర్దేశం చేశారు. ఎవరికైనా అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యాధికారితో వైద్యమందించాలని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆసుపత్రులకు తరలించాలని స్పష్టంచేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, మారుతున్న వాతావరణ పరిస్థితులతో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. హాస్టళ్లలో విపత్కర పరిస్థితులు తలెత్తగానే తక్షణమే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలన్నారు. అన్నపర్రు బీసీ హాస్టల్ వంటి ఘటనలు పునరావృతం కానివ్వొద్దన్నారు.

**రోజూ తనిఖీ ఫొటోలు పంపండి...**

డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, కో ఆర్డినేటర్లు రోజూ తమ పరిధిలో ఉన్న బీసీ హాస్టళ్లను, ఎంజేపీ స్కూళ్లను సందర్శించాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. సందర్శించిన కో ఆర్డినేట్ ఫొటోలతో తనిఖీ నివేదికలను వాట్సాప్ గ్రూప్‌లో పొందుపర్చాలన్నారు. హాస్టళ్ల నిర్వహణలో వార్డెన్లు, డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, కో ఆర్డినేటర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్య భద్రతతో కూడిన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆ లక్ష్యసాధనలో అందరూ భాగస్వాములు కావాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు.

**వంద శాతం ఫలితాలే లక్ష్యం**

రాబోయే టెన్త్, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు రావాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని మంత్రి సవిత స్పష్టంచేశారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారి కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులతో ప్రేమ పూర్వకంగా మెలుగుతూ, విద్యపై ఆసక్తి కలిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించేలా చూడాలన్నారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, డైరెక్టర్ మల్లికార్జున, ఎంజేపీ కార్యదర్శి మాధవీలత, వివిధ జిల్లాలకు డీబీసీడబ్ల్యూవోలు, ఏబీసీడబ్ల్యూవోలు, హాస్టల్ వార్డెన్లు కో ఆర్డినేటర్లు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

## పోలవరం నిర్వాసితులకు
# కూటమి ప్రభుత్వ దీపావళి కానుక

- పునరావాసానికి రూ.1100 కోట్లు
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో ప్రాజెక్ట్ పరుగులు
- జగన్ హయాంలో అంతులేని విధ్వంసం
- ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం దీపావళి కానుక అందిస్తోందని ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. గత శాసనసభ సమావేశాల అనంతరం ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యక్తం చేసిన అభిప్రాయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వ హయాంలో గత 16 నెలల్లో జలవనరుల శాఖ, ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు విషయంలో సాధించిన అద్భుత ప్రగతిని ప్రజల దృష్టికి తీసుకువస్తున్నామని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు నీటి పారుదల రంగానికి చేసిన కృషిని ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లలేకపోయామన్న ఉపముఖ్యమంత్రి మాటల్లో వాస్తవం ఉంది. కూటమి ప్రభుత్వం ఇప్పుడు అదే స్ఫూర్తితో పోలవరం ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తోంది. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం విషయంలో ఐదేళ్లలో వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని దారుణాన్ని ప్రజలు గమనించారు. అయితే కూటమి ప్రభుత్వం కేవలం 16 నెలల పాలనలో, నిర్వాసితులకు పునరావాసం కల్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన నిధులు విడుదల చేసింది. గత సంక్రాంతికి రూ.1000 కోట్లు, తాజాగా దీపావళి సందర్భంగా రూ.1100 కోట్లు కలిపి మొత్తం రూ.2,100 కోట్లను విడుదల చేసింది. అదే విధంగా ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వం నుండి ఈ 16 నెలల్లోనే రూ.12,157 కోట్లు సాధించింది. గతంలో 2014-2019 మధ్య చంద్రబాబు నాయుడు నాయకత్వంలో 72% పూర్తయిన పోలవరం ప్రాజెక్టును, వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 1.5% నుండి 2% మాత్రమే పూర్తి చేసి విధ్వంసానికి గురిచేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులను వేగవంతం చేయడంతో ప్రస్తుతం పోలవరం ప్రాజెక్టు దాదాపు 86% పూర్తయింది. ఇందులో భాగంగా గత ప్రభుత్వం నిలిపివేసిన ఎడమ కాలువ పనులను రూ.1200 కోట్లతో తిరిగి ప్రారంభించాం. కుడి కాలువ సామర్థ్యాన్ని 22,000 క్యూసెక్కులకు పెంచాం. వైఎస్సార్సీపీ పాలనలో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను రూ. 990 కోట్లతో పునర్నిర్మిస్తున్నాం. పనుల తీరును పరిశీలించిన విదేశీ నిపుణుల బృందం కూడా ప్రశంసించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. 2027 డిసెంబర్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శ్రీనివాసరావు తెలిపారు.

**జగన్ పాలనలో ఇరిగేషన్ సర్వనాశనం**

ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో నీటి పారుదల రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. చంద్రబాబు నాయుడుకి పేరు రాకూడదనే ఏకైక లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి 'రివర్స్ టెండరింగ్' పేరుతో పనులు రివర్స్ చేసి పోలవరాన్ని ఆపేశారు. దీని ఫలితంగా అత్యంత కీలకమైన డయాఫ్రమ్ వాల్ నాశనమైంది. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులతో సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రాజెక్టులను గాలికి వదిలేశారు. అంతేకాక, అక్రమ ఇసుక దందా కోసం అన్నమయ్య ప్రాజెక్టు గేట్లను ఎత్తకుండా వరదల్లో కొట్టుకుపోయేలా చేసి 42 మంది మరణానికి కారణమయ్యారు. పులిచింతల, తుంగభద్ర వంటి ప్రాజెక్టులకు కనీస నిర్వహణ లేకపోవడంతో గేట్లు కూడా కొట్టుకుపోయాయి. ఈ విధ్వంసకర పాలనకూ, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న అభివృద్ధి విధానాలకు తేడాను ప్రజలు గమనిస్తున్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పోలవరం పనుల్లో వేగం, అమరావతి పనుల పున:ప్రారంభం, పెట్టుబడుల ప్రవాహంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మంత్రి లోకేష్, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో సువర్ణ అధ్యాయం మొదలైంది. ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలు సాధ్యమనే నమ్మకం ఈ రోజు రాష్ట్ర ప్రజలకు కలిగింది. భవిష్యత్తులోనూ మరెన్నో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ఎమ్మెల్యే శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# వైద్యారోగ్యశాఖపై సమీక్షకు నూతన పంథా

- గత 6 నెలల్లో మీ శాఖ పనితీరు ఎలా ఉంది ?
- విభాగాధిపతుల స్పందన కోరిన మంత్రి సత్యకుమార్
- పనితీరు మదింపునకు 20 అంశాలను సూచించిన మంత్రి



అమరావతి (చైతన్యరథం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి 6 నెలల్లో (ఏప్రిల్ - సెప్టెంబర్, 2025) వైద్యారోగ్య మంత్రిత్వ శాఖలోని 10 విభాగాల పనితీరును సమీక్షించడానికి మంత్రి సత్యకుమార్ యాదవ్ నూతన పంథా చేపట్టారు. ఈ కాలంలో ఆయా విభాగాలు సాధించిన ఫలితాలు, సమస్యలు /అడ్డంకులు.. పరిష్కారం, సాధించిన మార్పు ఆధారంగా పనితీరు బాగా ఉందా, సంతృప్తి కరంగా ఉందా లేదా అనేది స్వయంగా వారే చెప్పాలని 10 విభాగాధిపతులకు మంత్రి సూచించారు. 20 అంశాల ఆధారంగా పనితీరును మదింపు చేయాలని మంత్రి సూచించారు.

ఏప్రిల్ - సెప్టెంబర్ కాలానికి సంబంధించి వివిధ విభాగాలు అందించే సమాచారం ఆధారంగా వైద్యరోగ్య శాఖ పనితీరును మంత్రి సత్యకుమార్ సమీక్షించనున్నారు. 14,000 ప్రభుత్వ డిస్పెన్సరీలు, ఆసుపత్రులు, పలు ఆరోగ్య పథకాల అమలుకు సంబంధించి వైద్య సేవలు, పథకాల అమలు నాణ్యత, ఫలితాల మదింపుపై దృష్టి సారించిన మంత్రి వినూత్నంగా విభాగాధిపతుల నుంచే పనితీరు అంచనాలు కోరడం విశేషం.

పనితీరు, ఫలితాలను నిర్దిష్టంగా అంచనా వేయడానికి స్పష్టమైన కొలమానాలుండాలని భావించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, ఈ దిశగా 20 అంశాలను సూచించారు.

వైద్య సేవలు, పథకాల అమలులో మెరుగుకోసం ఆయా శాఖలు ప్రవేశపెట్టిన / సాధించిన ఐదు మార్పులు, ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిలో పరిస్కారం చేసిన వాటి వివరాలు, నూతన మౌలిక సదుపాయాల కల్పన, వైద్య సిబ్బంది నియామకాలు, ఓపీ - ఐపీ సేవల్లో ప్రగతి, డయాగ్నోస్టిక్ సేవల సంఖ్య- పరికరాల కొనుగోలు, వైద్యులు - ఇతర సిబ్బంది హాజరు, బడ్జెట్ కేటాయింపులు - గత 6 నెలల్లో ఖర్చు వివరాలు, వైద్య సేవల విస్తరణ - నూతన సేవల ప్రారంభం, తదితర అంశాలపై మంత్రి నివేదిక కోరారు.

వివిధ విభాగాధిపతుల నుండి ప్రత్యక్షంగా పనితీరు అంచనాపై వ్యక్తమైన స్పందన, 20 వివిధ అంశాలకు సంబంధించిన సమాచారం ఆధారంగా త్వరలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చేపట్టనున్న సమీక్షపై మంత్రిత్వ శాఖలో ప్రస్తుతం చర్చ జరుగుతోంది.

# జోగి, పేర్ని తీరు జుగుప్సాకరం

అమరావతి (చైతన్యరథం): గత నాలుగైదు రోజులుగా వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ పిచ్చి ప్రేలాపనలను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని కృష్ణాజిల్లా గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 15 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన, తండ్రి వయసున్న చంద్రబాబు నాయుడుని ఉద్దేశించి మనం మనుషులమనే కనీస స్పృహ లేకుండా, ఇంగిత జ్ఞానం మరిచి ఎంత దిగజారిపోయావురా అని మాట్లాడటం సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉందని తప్పుబట్టారు. అన్నం తింటున్నారో లేక గడ్డి తింటున్నారో ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం జోగి రమేష్‌కి ఉందన్నారు. గతంలో మంత్రి పదవిపై ఆశతో జగన్మోహన్ రెడ్డి మెప్పు పొందడం కోసం చంద్రబాబు నాయుడు ఇంటిపైకి దాడికి వెళ్లడం వంటి జుగుప్సాకరమైన కార్యక్రమాలు చేసినందుకే మీకు పదవి లభించింది. అధికారం ఉన్నప్పుడు వీరత్వం ప్రదర్శించడం కాదు, ఇప్పుడు ధైర్యం ఉంటే చంద్రబాబు నాయుడు ఇంటి గేటును తాకి చూడాలని సవాల్ విసిరారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విజయవాడలో నకిలీ మద్యం తాగి 10 మంది మరణించిన ఘటన జరిగింది. 2019-2024 మధ్య వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో జరిగిన ఆ నకిలీ మద్యం మరణాల కేసుపై కానీ, బార్లలో నకిలీ మద్యం సరఫరాపై కానీ ఎందుకు చర్యలు తీసుకోలేదు? 2019-2024 మధ్య కాలంలో కూడా నకిలీ మద్యం సరఫరా కొనసాగినా, అప్పటి వైఎస్సార్సీపీ ప్రభుత్వం ఆ విషయాన్ని బయటపడకుండా కప్పిపుచ్చింది. కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇవన్నీ బయటపడుతున్నాయి. గత వైఎస్సార్సీపీ పాలనలో మద్యం దుకాణాల్లో డిజిటల్ పేమెంట్స్ లేకుండా వేల కోట్లు దోచుకున్నారు. అందుకే కూటమి ప్రభుత్వం

**• బూతులతో కృష్ణాజిల్లాకు తలవొంపులు**

**• అన్నం బదులు గడ్డి తింటున్నారేమో?**

**• తప్పుచేసిన జోగి తప్పించుకునేందుకు కులం కార్డు**

**• గతంలో మంత్రి పదవికోసం చంద్రబాబు ఇంటిపై దాడి**

**• దమ్ముంటే ఇప్పుడు గేటును తాకి చూడండి**

**• ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ధ్వజం**



నకిలీ మద్యాన్ని అరికట్టడానికి 'సురక్ష యాప్'ను తీసుకువచ్చి క్యూఆర్ కోడ్ స్కాన్ చేసే విధానాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే వెంకట్రావు వివరించారు.

**అడ్డంగ దొరికి కుల రాజకీయాలా..**

తప్పుచేసి అడ్డంగా దొరికిన జోగి రమేష్ తనపై జరుగుతున్నది కేవలం కుల రాజకీయ దాడి అని చెప్పుకోవడం చాలా బాధాకరం. గౌడ కులానికి మీరే నాయకుడినని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది. గౌడ కులం నుంచి వచ్చిన మహోన్నత నాయకులు సర్దార్ గౌతు లచ్చన్న. సర్దార్ వల్లభాయ్ పటేల్ తర్వాత సర్దార్ బిరుదు పొందిన ఏకైక నాయకులు. తన గురువు ఆచార్య ఎన్.జి. రంగా (కమ్మ కులస్థుడు) గుంటూరు పార్లమెంట్‌లో ఓడిపోతే, తాను రాజీనామా చేసి ఆయనను తిరిగి ఎంపీగా గెలిపించిన చరిత్ర లచ్చన్నది. అలాంటి మహానుభావులకు మాత్రమే కులానికి నాయకులం అని చెప్పుకునే అర్హత ఉంటుంది.. జోగి రమేష్ లాంటి వారికి కాదు. జోగి రమేష్ సొంత కులానికి చెందిన కృష్ణా జిల్లా జడ్పీ చైర్మన్ ఉప్పాల హారికని మంత్రిగా ఉన్నప్పుడు ప్రొటోకాల్ ప్రకారం ఏనాడూ గౌరవించలేదు. ప్రభుత్వ కార్యక్రమాలకు, ప్రారంభోత్సవాలకు కూడా ఆమెను రానివ్వకుండా అవమానించిన నీచ చరిత్ర జోగి రమేష్. ఒకే పార్టీలో ఉండి కూడా తోటి మహిళా నాయకురాలిని అవమానించిన వ్యక్తి ఇప్పుడు కులం గురించి మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే వెంకట్రావు దుయ్యబట్టారు.

**జోగి, పేర్ని తీరుతో జిల్లాకు చెడ్డపేరు**

జోగి రమేష్ రాజకీయ జీవితంలో నిలకడ లేదు. 2009లో పెడన నియోజకవర్గం ప్రజలు గెలిపిస్తే 2014 ఎన్నికలకు అక్కడి నుంచి పారిపోయారు. మళ్లీ 2019లో అక్కడి నుంచే గెలిచి మంత్రి అయ్యారు. ఐదేళ్ల దోపిడీతో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుని పెడన నుంచి పారిపోయి పెనమలూరులో పోటీ చేసే పరిస్థితికి వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారం లేనప్పుడు కార్యకర్తలను గాలికి వదిలేసి పోయారని కార్యకర్తలే తప్పుబడుతున్నారు. మాజీ మంత్రులు జోగి రమేష్, పేర్ని నాని వంటి వారు అధికారంలో ఉన్నప్పుడు వీధిన పడి బూతులు తిట్టి తెలుగు భాషను అగౌరవపరిచారు. కృష్ణా జిల్లాకు తలవంపులు తెచ్చారు. ప్రస్తుతం జోగి రమేష్‌కి 2029లో సీటు గ్యారెంటీ లేదనే భయంతోనే చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్‌పై అవాకులు చవాకులు పేలుతూ ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఎమ్మెల్యే వెంకట్రావు ఆరోపించారు. గతంలో టీడీపీకి 23 సీట్లు వస్తే.. చంద్రబాబుకు ప్రతిపక్ష హోదా తొలగిద్దామనే కుట్రతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన మీకు, ఇప్పుడు ప్రజలు ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకపోయినా, ప్రతిపక్ష హోదా కావాలని అడుగుతున్నారని ఎమ్మెల్యే వెంకట్రావు ఎద్దేవా చేశారు. వైజాగ్ లో ఓడిపోయారనే కారణంతో జగన్ రెడ్డి సొంత తల్లినే పక్కన పెట్టారు. ఈ సారి అభ్యర్థులందరినీ మార్చేస్తాడేమోనన్న భయంతోనే ఈ నాయకులు అర్థం లేని విమర్శలు చేస్తున్నారు. గతంలో బూతులు మాట్లాడినందుకే ప్రజలు ఛీకొట్టి 11 సీట్లకు పరిమితం చేసినా వైసీపీ నేతలు మళ్లీ అదే పంథాను కొనసాగిస్తున్నారు. జోగి రమేష్ ఇప్పటికైనా సంస్కారం నేర్చుకొని, తన భాషను సరిచేసుకోవాలి. ప్రజలు అన్ని గమనిస్తున్నారు. ఇదే పద్ధతిలో మీరు మాట్లాడితే రానున్న ఎన్నికల్లో 11 సీట్లు కూడా రాకుండా పోతాయి. కృష్ణా జిల్లా మహోన్నత రాజకీయ చరిత్ర ఉన్న జిల్లా. దేశానికి జాతీయ జెండాను రూపొందించిన పింగళి వెంకయ్య కృష్ణా జిల్లా వాసి కావటం గర్వకారణం. దివంగత ఎన్టీఆర్ ఈ జిల్లా నుంచే వచ్చి తెలుగుదేశం పార్టీ స్థాపించి బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కట్టబెట్టారు. అటువంటి చరిత్ర ఉన్న జిల్లాకు జోగి రమేష్ లాంటి వైసీపీ నాయకులు బూతులతో తలవంపులు తెస్తున్నారు. గూగుల్ వంటి సంస్థ రాష్ట్రానికి రావడానికి ఎవరు కారణమో వైసీపీ నేతలు బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే వెంకట్రావు సవాల్ విసిరారు.

# విశాఖకు గూగుల్ ఏపీకి సువర్ణాధ్యాయం

**- మంత్రి లోకేష్ కృషితో పెట్టుబడుల వెల్లువ**

**- తట్టుకోలేక వైసీపీ ఏడుపులు**

**- కోడిగుడ్డు మంత్రి కట్టుకథలు**

**- శాప్ చైర్మన్ రవి నాయుడు**






విజయవాడ (చైతన్యరథం): విశాఖ పట్నం లో గూగుల్ డేటా సెంటర్ రావటం ఆంధ్రప్రదేశ్ కు సువర్ణ అధ్యాయమని శాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. మంత్రిగా నారా లోకేష్, బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రానికి పరిశ్రమల ప్రవాహం మొదలయిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పారిశ్రామికవేత్తలు ఆంధ్రప్రదేశ్ లో మాత్రమే పెట్టుబడి పెడతాం అనే పరిస్థితి నెలకొందని, వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా ఆంధ్రకు రాలేదని విమర్శలు గుప్పించారు. విజయవాడ లోని శాప్ కార్యాలయంలో చైర్మన్ రవి నాయుడు శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రం సహకారంతో మంత్రి నారా లోకేష్ కృషితో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయన్నారు. ఎప్పటికప్పుడు పరిశ్రామికవేత్తల వద్దకు వెళ్లి పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ వేదికగా అప్పటి సీఎం చంద్రబాబు పరిశ్రమ పెద్దలకు ఆనాడు ఎలా సహకరించారో అలాంటి సహకారం ఇప్పుడు ఉంటుందని పారిశ్రామికవేత్తలు విశ్వసిస్తున్నారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు వస్తేనే అభివృద్ధి జరుగుతుందనేది సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ ఆలోచన అన్నారు. విశాఖ లో గూగుల్ పెట్టుబడి పెట్టేందుకు ఒప్పందం జరిగిందనీ, ఒకప్పుడు ఐటీ అంటే హైదరాబాద్, చెన్నై , బెంగళూరు గుర్తుకు వచ్చేవని, రానున్న రోజుల్లో వైజాగ్‌గా ఐటీ హబ్‌గా నిలుస్తుందని రవినాయుడు అన్నారు.

**గూగుల్ వస్తుంటే విషం చిమ్ముతున్నారు**

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ప్రకటన రాగానే రాష్ట్ర ప్రజలు ప్రతి ఒక్కరు మద్దతు తెలిపారు. రాష్ట్ర వినాశనం కోరుకునే వారు మాత్రమే వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు. ఉద్యోగ అవకాశాలు రాష్ట్రానికి రాకూడదా అని వైసీపీ నాయకులను సూటిగా ప్రశ్నిస్తున్నా. కోడిగుడ్డు మంత్రి ఒకాయన మన రాష్ట్రంలో ఉన్నాడు. కోడి గుడ్డు పెట్టింది పొదగాలి ... తర్వాత పిల్ల అవ్వాలి.. తల్లి అవ్వాలి అని పిచ్చి మాటలు మాట్లాడాడు. వాళ్ల హయాంలోనే అదానీ డేటా సెంటర్ తీసుకుని వచ్చాం అంటున్నారు. మీకసలు సిగ్గుందా. డావోస్‌లో చలిగా ఉంటుందనే కారణంతో వెళ్ళలేదు అని చెప్పిన వాళ్లు కూడా గూగుల్ డేటా సెంటర్ గురించి మాట్లాడటమా. గూగుల్ రాకతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షల మంది ఉపాధి పొందుతారు. దేశానికే తలమానికంగా విశాఖలో గూగుల్ నిలవనుంది. మేము పరిశ్రమలు తీసుకురావటం వైసీపీ నేతలకు బాధగా ఉండవచ్చు. రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించే విధంగా మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రజలు ఇలాంటి వారి గురించి ఆలోచించాలి. ప్రతిపక్షంలో అధికార పక్షంలో ఉన్నా...రాష్ట్రానికి మంచి జరుగుతున్నప్పుడు స్వాగతించాలి. ప్రజా సమస్యల మీద ఒక్క మాట మాట్లాడరు. మంచి జరుగుతుంది అంటే చాలు అడ్డుకునేందుకు వచ్చేస్తారు. గూగుల్ లాంటి ప్రతిష్టాత్మకమైన కంపెనీ రాష్ట్రానికి వస్తే తట్టుకోలేకపోతున్నారు. స్వాగతించాల్సింది పోయి విషం చిమ్ముతున్నారు. కోడిగుడ్డు అమర్నాథ్ రాష్ట్ర వినాశనాన్ని కోరుతున్నాడు. ఎన్ని చేసినా వచ్చే పరిశ్రమలను ఆపలేరని రవినాయుడు స్పష్టం చేశారు.

**మద్యం నిందితుల ధర్నాలు హాస్యాస్పదం**

కర్నూలు లో జీఎస్టీ సభ అద్భుతంగా సాగింది. విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మద్యం స్కాం చేసిన వారందరూ ఒక్క చోటే ఉండి మా మీదే ఆరోపణలు చేస్తున్నారు. మద్యం ఏరులై పారుతుందని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కరుణాకర్ రెడ్డి.. ఇలా అందరూ కలసి రోడ్డు మీద ధర్నా చేయటం చాలా హాస్యాస్పదం గా ఉంది. పెద్దిరెడ్డి కొడుకు మిథున్ రెడ్డి లిక్కర్ స్కాంలో జైలు కి వెళ్ళి బెయిల్ మీద బయటకు వచ్చారు. సజ్జల, పెద్దిరెడ్డి, విజయసాయి రెడ్డి, మాజీ సీఎం బందువులు, అందరూ మద్యం కుంభకోణం లో నిందితులుగా ఉన్నారు. మద్యం కుంభకోణం లో ఎవరు ఉన్నా వదిలేది లేదు. నకిలీ మద్యం తయారుచేసే జనార్ధన్ ఇప్పటికే జైలుకు వెళ్ళాడు. నకిలీ మద్యం లో పాత్రధారులందరూ జైలు కు వెళ్లక తప్పదని రవినాయుడు హెచ్చరించారు.

**లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం**

విశాఖకు గూగుల్ వచ్చేందుకు కృషి చేసిన మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ శాప్ చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి యువత పాలాభిషేకం చేశారు. రానున్న కాలంలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్ చొరవతో మరిన్ని పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్‌కు రాబోతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

# పీఎం మోదీకి ఏపీ అంటే అమిత ప్రేమ

- అందుకే 16 నెలల్లో 5 సార్లు రాష్ట్రంలో పర్యటన
- రూ.లక్షల కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- వికసిత భారత్‌లో ఏపీని కీలకంగా మార్చాలన్నదే పీఎం ఆశయం
- ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



అమరావతి (చైతన్యరథం): ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమన్నా, ప్రజలన్నా అమితమైన ప్రేమ ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. కర్నూలు పర్యటన సందర్భంగా ప్రధాని ఈ విషయాన్ని మరోమారు చాటిచెప్పారని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటన విజయవంతమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఏపీ అభివృద్ధి పథంలో భాగమైనందుకు ప్రధాని మోదీకి సత్య కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని మిగిలిన రాష్ట్రాలన్నిటికంటే కూడా ప్రధాని మోదీ హృదయంలో ఏపీకి ప్రత్యేక స్థానముందన్నారు. మోదీ మూడో పర్యాయం ప్రధాని మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్క ఏపీలో మాత్రమే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి 5 సార్లు పర్యటించారని, మరే ఇతర రాష్ట్రంలోనూ ఆయన ఇన్ని సార్లు పర్యటించలేదని తెలిపారు. తాను ప్రధాని కార్యాలయంలో ఈ విషయం గురించి స్వయంగా అడిగి తెలుసుకున్నానని చెప్పారు.

**ప్రతి పర్యటనకు ఓ విశేషం**

మోదీ మూడో పర్యాయం ప్రధాని అయ్యాక 2024 జూన్ 12న తొలిసారిగా ఏపీలో కూటమి ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చారని, రెండోసారి ఈ ఏడాది జనవరి 8వ తేదీ విశాఖపట్నం నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో రూ.2.10లక్షల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారని తెలిపారు. మే నెల 1, 2వ తేదీల్లో అమరావతిలో పర్యటించి రూ.58వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారన్నారు. తదుపరి నాలుగో పర్యాయం జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్నారు. లక్షలాది మందితో ఒకేసారి 3లక్షల మందితో యోగాసనాలు వేయడం ద్వారా ఏపీ గిన్నిస్ రికార్డు నమోదు చేసిన ఈ కార్యక్రమంలో మోదీ స్వయంగా పాల్గొనడంతో ప్రపంచం మొత్తం ఏపీవైపు చూసేలా చేశారన్నారు. ఇప్పుడు ఐదో సారి కర్నూలులో పర్యటించి రూ.13,430 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారని తెలిపారు.

**ఏపీనే కీలకం**

2047 వికసిత భారత్‌లో ఆంధ్రప్రదేశ్‌ను కీలకంగా మార్చాలన్నదే ప్రధాని మోదీ ఆశయమన్నారు. మోదీ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. మోదీ సహకారంతో దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఏపీ అవతరిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని మంత్రి సత్యకుమార్ తెలిపారు.

## 51 లక్షల మెట్రిక్ టన్నుల

# ధాన్యం కొనుగోలు లక్ష్యం

- 27 నుంచి ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం
- రైతు కే మొదటి స్థానం
- మార్పు కోసం కలిసి పని చేద్దాం
- పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్




విజయవాడ (చైతన్యరథం): 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశం విజయవాడలోని హోటల్ తాజ్ వివంత లో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మనోహర్ మాట్లాడుతూ పదిమందికి ఉపాధి కల్పించాలని, గౌరవం కోసం రైస్ మిల్లులు ఏర్పాటుచేసి, పనిచేస్తున్న రైస్ మిల్లర్ల లకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం పెట్టివెళ్లిన 1674 కోట్ల రూపాయల బకాయిలను తీర్చడంలోనూ, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ మిల్లర్లకు చెల్లించవలసిన 763 కోట్ల రూపాయలు చెల్లించడం ద్వారా కూటమి ప్రభుత్వం చాలా పారదర్శకంగా పనిచేస్తోందన్నారు. గత ఏడాది 34 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామన్నారు. ఈ ఏడాది 2025-26 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 51లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. బ్యాంక్ గ్యారంటీలు 1:2 ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకుగాను 35 బ్యాంకు సేవలను ఉపయోగించు కోవచ్చు అని తెలిపారు. కొన్ని జిల్లాలలో రైస్ మిల్లుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని రియల్ టైం గవర్నెన్స్ చేసి చూపిస్తామన్నారు.

సంస్కరణలలో భాగంగా వాట్సాప్ ద్వారా రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. వాట్సాప్‌లో "హాయ్" అని మెసేజ్ పంపగానే కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల నుంచి 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు గుర్తు చేశారు. పేపర్ లెస్ ఆర్గనైజేషన్, తదితర నిర్ణయాలు తీసుకున్నామన్నారు. మార్పు కోసం కలిసి పని చేద్దాం అని మంత్రి పిలుపునిచ్చారు. పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్ అరికట్టడంలో ప్రభుత్వానికి రైస్ మిల్లర్లు తోడుగా నిలవాలి. రైతు కోసం కలిసి పనిచేద్దాం, వ్యవస్థను గౌరవిద్దామని మంత్రి అన్నారు. గత ఏడాది అనుభవంతో, తేమ శాతం కొలిచే యంత్రాలు, రవాణా సదుపాయాలు, నాణ్యమైన గన్నీ బ్యాగులు ముందుగానే సిద్ధం చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. సమస్య పరిష్కారానికి ఎప్పుడు సిద్ధంగా ఉండాలని, పని చేసే విధానం పారదర్శకంగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడ సమస్య లేకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా తేమ శాతం నిర్ధారించే మిషన్లు, రవాణా విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 27 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో 3013 రైతు సేవా కేంద్రాలు, 2061 పీపీసీ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, మొత్తం 10,700 సిబ్బందితో ధాన్యం సేకరణకు సిద్ధమవుతున్నట్లు మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ ప్రతినిధులకు ముందుగానే మంత్రి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్ గౌర్ మాట్లాడుతూ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ధాన్యం సేకరణ వివరించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, ఎండీ ఢిల్లీ రావు మాట్లాడుతూ విధుల్లో చేరిన తొలిరోజునే రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధుల సమావేశంలో పాల్గొనటం చాలా ఆనందంగా ఉందన్నారు. 2024-2025 సంవత్సరం ధాన్యం కొనుగోలు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకొచ్చిందన్నారు.

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్ గోవిందరావు, ఎఫ్‌సిఐ జీఎం విజయ్ కుమార్ యాదవ్ ప్రసంగించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వల్లూరి సూరి ప్రకాష్ రావు, కోశాధికారి రంగయ్య నాయుడు, 26 జిల్లాల రైస్ మిల్లర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైసీపీ నేత జోగి రమేష్..

# అవినీతి, అక్రమాలు, అరాచకాలకు నిలువెత్తు రూపం

- ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మండిపాటు
- నకిలీ మద్యం కుంభకోణంలో నిందితులందరూ జైలుకు వెళ్లడం ఖాయం
- తప్పుచేసి కులాలను రెచ్చగొట్టే మాటలా?
- ఐదేళ్లపాటు పెడన నియోజకవర్గాన్ని దోచుకున్న జోగి



అమరావతి (చైతన్యరథం): వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి జోగి రమేష్ పేరు చెబితేనే పెడన నియోజకవర్గం ప్రజలు భయపడే పరిస్థితి గతంలో ఉండేదని కృష్ణా జిల్లా పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జోగి రమేష్ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాలంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలను పూర్తిగా దోచుకున్నారని, ప్రజల రక్తాన్ని పిండేశారని ఆరోపించారు. కృత్తివెన్ను మండలంలో ఆక్వా రంగం అభివృద్ధి చెందుతుంటే చెరువులు తవ్వాలంటే రైతుల నుంచి డబ్బులు దండుకున్నారని, డబ్బులు చెల్లించకపోతే పనులు చేయనివ్వేవారు కాదన్నారు. బంటుమిల్లి, పెడన ప్రాంతాల్లో మట్టిని అక్రమంగా తరలించి ప్రతి ఏటా కోట్లాది రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి ప్రజలను పీల్చి పిప్పి చేసి నియోజకవర్గాన్ని పూర్తిగా దండుకున్నారని దుయ్యబట్టారు. గత ప్రభుత్వంలో జోగి రమేష్ ప్రజలను అణిచివేసే ప్రయత్నం చేశారని, ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టించారని తెలిపారు. తన కారు వస్తే టోల్‌గేట్ వద్ద నిలబడలేదని ఓ యువకుడిని, బ్యానర్లు కట్టారని ఇంకొకరిని, మీటింగ్‌లో బండిపై కూర్చున్నాడని మరో యువకుడిని తీసుకెళ్లి జైల్లో పెట్టించిన సంఘటనలు అనేకం ఉన్నాయని గుర్తుచేశారు. ప్రజలు ఆయన్ను ఎంతగా చీదరించుకున్నారంటే, జింజర్ గ్రామంలో పర్యటనకు వెళ్లినప్పుడు ఒక కుర్రాడి అక్రమ అరెస్టు విషయంలో ఆ కుర్రాడిని విడుదల చేసే వరకు ఆ ఊరి నుంచి కదలకుండా ప్రజలు అడ్డుకున్నారని తెలిపారు. ప్రజల తిరస్కరణ కారణంగానే పెడన నుంచి పెనమలూరుకు పారిపోయి పోటీ చేస్తే, అక్కడి ప్రజలు నెల రోజులకే అర్థం చేసుకుని చిత్తుగా ఓడించి ఇంటికి పంపించారని విమర్శించారు. అయినా బుద్ధి తెచ్చుకోకుండా మళ్లీ మైలవరంలో డ్రామాలు మొదలుపెట్టారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డిని ప్రసన్నం చేసుకోవడం కోసం ఇష్టానుసారం ప్రేలాపనలు చేస్తూ, కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు జోగి రమేష్ నకిలీ మద్యం కుంభకోణాన్ని మొదలుపెట్టి అడ్డంగా దొరికిపోయారన్నారు. ఈ కేసులో నిందితుడు జనార్దన్ రావు స్వయంగా జోగి రమేష్ ఆదేశాలతోనే నకిలీ మద్యం ప్రారంభించినట్లు వీడియోలో తెలిపారన్నారు. గత ప్రభుత్వంలో కూడా ఇది జరిగిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భయంతో ఆగిపోయినా, కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేయడానికి జోగి రమేష్ తనను పిలిపించి మళ్లీ నకిలీ మద్యం దందా మొదలుపెట్టాలని చెప్పినట్లుగా జనార్దన్ రావు వీడియోలో తెలిపిన విషయాన్ని అందరూ చూశారన్నారు. జోగి రమేష్ పిచ్చి ప్రేలాపనలు చేయకుండా, చెంపలు వేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు.

**తప్పుచేసి కులం కార్డు..**

నకిలీ మద్యం వ్యవహారంలో అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారని, ఈ కుంభకోణంలో నిందితులతో సహా జోగి రమేష్ జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు. జోగి రమేష్ తప్పు చేసిన ప్రతిసారీ బీసీ కులం, గౌడ కులం అని చెప్పుకుంటూ కులాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, అయ్యన్నపాత్రుడు వంటి బీసీ నాయకత్వాన్ని అణగదొక్కి, అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టించినప్పుడు బీసీ కులం గుర్తు రాలేదా అని ప్రశ్నించారు. గతంలో అమరనాథ్ గౌడ్ అనే చిన్న కుర్రాడికి న్యాయం చేయమని గౌడ సంఘాలు అడిగితే, 'కులాల కూడు పెడతాయా' అని మాట్లాడిన జోగి రమేష్, ఇప్పుడు తన తప్పు కప్పిపుచ్చుకోవడానికి కులాలను వాడుకుంటున్నారని తప్పుబట్టారు. గౌడ కులంలో మంచి పేరు తీసుకొచ్చిన నాయకుల పేరును చెడగొట్టే విధంగా జోగి రమేష్ ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో పెడన నియోజకవర్గంలో ఏ పని జరగాలన్నా, ఏ ఉద్యోగం కావాలన్నా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 'జే ట్యాక్స్' కంటే ఎక్కువగా 'జోగి ట్యాక్స్' కట్టాల్సి వచ్చేదని ఆరోపించారు. ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న రైతుల దగ్గర నుంచి వేలకు వేలు దండుకున్నారని, శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తిని నియమించుకుని రైతులను దోచుకున్నారని ధ్వజమెత్తారు. అన్ని అనుమతులు తీసుకుని చెరువు తవ్వుకున్నా అధికారులను పంపి డబ్బు వసూలు చేశారన్నారు. అందుకే ప్రజలు ఆయన్ను నియోజకవర్గం నుంచి తరిమికొట్టారు.. పెడన ప్రజలు జోగి రమేష్‌ను టెర్రరిస్టులా భావిస్తున్నారు.. నియోజకవర్గంలో అడుగు పెట్టలేని పరిస్థితిలో పక్క జిల్లాలకు పారిపోయి ఇలాంటి అరాచకాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ తీవ్రంగా విమర్శించారు.

# రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

**- రాజమహేంద్రవరం నూతన మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనాకు మంత్రి కందుల దుర్గేష్ సూచన**

**- బాధ్యతలు స్వీకరించిన అనంతరం మంత్రి కందుల దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాహుల్ మీనా**



రాజమహేంద్రవరం: రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని నూతన మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనాకు మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ఇటీవల బదిలీపై రాజమహేంద్రవరం వచ్చిన రాహుల్ మీనా మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శుక్రవారం రాజమహేంద్రవరంలోని నివాసంలో మంత్రి దుర్గేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు.

ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజమహేంద్రవరం నగర పాలక సంస్థలో నెలకొన్న సమస్యలకు పరిష్కార మార్గాలను, కార్పొరేషన్ అభివృద్ధి, గోదావరి పుష్కరాలపై చర్చించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ రాహుల్ మీనాకు సూచించారు.

## యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే అరిమిల్లి



తణుకు (చైతన్యరథం): యువత అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పేర్కొన్నారు. జిల్లా యువజన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తణుకు ఎస్.కె.ఎస్డీ మహిళా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. "యువత వారికి కల్పిస్తున్న అవకాశాలపై గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి ఉన్న తేడాను గుర్తించాలన్నారు. కూటమి ప్రభుత్వం సాఫ్ట్వేర్, ఇతర రంగాల్లో యువతకు అవకాశాలను కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో యువత గంజాయికి అలవాటు పడితే, ప్రస్తుతం యువత లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థాయి దిశగా అడుగులు వేస్తున్నారు" అని అన్నారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. నైపుణ్య అభివృద్ధి, సీడాప్, ఇతర అవకాశాలు, సాంకేతికతలో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులను యువత అర్థం చేసుకోవాలన్నారు.

## పురాతన శాస్త్రీయ విధానంలో సింహాచలం ఆలయం పైకుప్ప మరమ్మత్తులు : ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



సింహాచలం (చైతన్యరథం): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం ఆలయం పైకప్పు మరమ్మతు పనులను పురాతన శాస్త్రీయ విధానంలో చేపట్టడం వల్ల మరో 200 ఏళ్లపాటు లీకేజీ సమస్యలు ఉత్పన్నం కావని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. పైకప్పు లీకేజీల నివారణ ప్రాజెక్టు పనులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం ఆయన ఆలయాన్ని సందర్శించారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. పుణెకు చెందిన లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలిజియస్ ట్రస్టు.. రూ.5 కోట్ల వ్యయంతో ఫిబ్రవరిలో ప్రారంభించిన పనులను.. నిర్దేశించుకున్న గడువు కంటే ముందుగానే పూర్తి చేసిందని తెలిపారు. కరక్కాయ, సున్నం, బెల్లం, బెండకాయ జిగురు తదితర పదార్థాల మిశ్రమాన్ని పైకప్పుమీద పూసి, సహజసిద్ధమైన రీతిలో లీకేజీలు నివారించారన్నారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి తదితర ప్రముఖ ఆలయాల్లో లీకేజీల నివారణ ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయని వివరించారు. గతంలో సిమెంట్, కాంక్రీట్‌తో లీకేజీల నివారణ పనులు చేపట్టినప్పటికీ ఫలితం ఇవ్వలేదని.. సింహాద్రి అప్పన్న ఆశీస్సులతో ఇప్పుడు దానికి పరిష్కారం లభించిందన్నారు.

# కాకినాడ ప్రజాదర్బార్‌కు పోటెత్తిన అర్జిదారులు



కాకినాడ (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్‌కు శుక్రవారం అర్జిదారులు పోటెత్తారు. సామర్లకోట మండలం కొప్పవరం గ్రామంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కార్యాలయంలో శుక్రవారం జరిగిన 26వ ప్రజా దర్బార్‌లో ఉద్యోగ-ఉపాధి అవకాశాలు, ఇల్లు స్థలాలు, డ్రైనేజీ నిర్మాణం, సీఎం రిలీఫ్ ఫండ్, వైద్య సహాయం, బియ్యం కార్డు మంజూరు, కార్డుల్లో పేరు మార్పులు-చేర్పులు, పింఛన్లు, వంటి అంశాలపై మొత్తం 29 వినతులు అందాయి. వాటిలో పలు సమస్యలు వెంటనే పరిష్కరించగా, మిగతావి సంబంధిత అధికారులకు పంపి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు ప్రారంభించామని కార్యాలయ ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా వినిపించి, వెంటనే పరిష్కారం పొందుతున్నారని, ముఖ్యంగా నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాల కోసం పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్ , శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ చెప్పడి వెంకటేశ్వరరావు, డీఆర్‌యూసీసీ సభ్యుడు ముత్యాల అనిల్, నాయకులు జున్నూరు బాబ్జి, సిరియాల కొండబాబు, ఐటీడీపీ పాలికా సతీష్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాయవరం ప్రమాద ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు

**● ఘటనా స్థలాన్ని పరిశీలించిన దిసభ్య కమిటీ సభ్యులు**



రాయవరం (చైతన్యరథం): బాణాసంచా తయారీ కేంద్రంలో ప్రమాద ఘటనపై అన్ని కోణాలలో విచారణ, దర్యాప్తు చేపట్టినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ద్విసభ్య కమిటీ సభ్యులుగా ఉన్న పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిధిలోని ఈనెల 8వ తేదీ విసావరం శివారు గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ నందు జరిగిన బాణాసంచా ప్రేలుడు ప్రమాద ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ద్విసభ్య కమిటీ సభ్యులైన పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్, ఈగల్ ఐజి ఆర్కే రవికృష్ణ శుక్రవారం క్షేత్ర స్థాయి పర్యటన నిర్వహించి సంఘటన జరగడానికి గల కారణాలపై స్థానిక రెవెన్యూ పోలీస్ ఫైర్ కార్మిక శాఖ అధికారులతో విచారించారు ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ... డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరంలోని గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రంలో ఈనెల 8న జరిగిన పేలుడు ఘటనపై విచారణకు రాష్ట్రప్రభుత్వం నియమించిన ద్విసభ్య కమిటీ క్షేత్రస్థాయిలో బాణాసంచా ప్రేలుడు ప్రమాద ఘటనపై ప్రాథమిక విచారణ స్థానికులు అధికారులతో విచారించినట్లు తెలిపారు. ప్రమాద సంఘటన జరిగిన వెంటనే అధికారులు నిర్వహించిన ప్రాథమిక విచారణ నివేదికలను పరిశీలించడం జరిగిందన్నారు. స్థానిక అధికారులు తయారీ కేంద్రానికి భద్రతా ప్రమాణాలను నిబంధనల ప్రకారం ఉన్నాయని సంయుక్త తనిఖీలు నిర్వహించి అన్ని కోణాలలో ధ్రువీకరిస్తూ లైసెన్సు అనుమతులు జారీ చేసి నో అబ్జెక్షన్ ధ్రువపత్రాన్ని జారీ చేశారన్నారు. బాణాసంచా తయారీలో కచ్చితంగా నిబంధనలు పాటించారా లేదా అన్న అంశంలో అనుమానాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రేలుడుకు సంబంధించి ఫోరెన్సీకి నివేదిక రావలసి ఉందని ఆయన వెల్లడించారు. ఈ నివేదిక వస్తే మరిన్ని విషయాలు తెలుస్తాయని తద్వారా ప్రేలుడు జరగడానికి గల కారణాలు కూడా తెలుసే అవకాశం ఉందన్నారు పేలుడు ఘటనలో మృత్యువాత పేద బాధిత కుటుంబాల వారికి నష్టపరిహారాలు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. విచారణ నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ రాహుల్ మీనా, ఆర్డిఓడి అఖిల, జిల్లా అగ్నిమాపక విపత్తుల స్పందన అధికారి పార్థసారథి, తాసిల్దార్ ఎస్‌బి భాస్కర్, సహాయ కార్మిక కమిషనర్ టీ నాగలక్ష్మి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల కోసం మెడికల్ క్యాంపు

**● ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు పంపిణీ**



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఎన్టీఆర్ ట్రస్ట్ మరియు గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజవోలులో రాజమండ్రి రూరల్ మండల పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్, గోరంట్ల శాంతారావు ఫౌండేషన్ సంయుక్తంగా యువ నాయకుడు డాక్టర్ రవిరాం కిరణ్ సారధ్యం ఈ మెడికల్ క్యాంపు నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలానికి చెందిన పారిశుధ్య కార్మికులకి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ బట్టి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా డాక్టర్ రవిరాం కిరణ్ మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులు ఆరోగ్యం చాలా ముఖ్యమని, ప్రతి గ్రామం పరిశుభ్రంగా ఉంటుందంటే అందుకు ముఖ్యకారణం పారిశుధ్య కార్మికులే అని గుర్తుచేశారు. అనునిత్యం రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థని శుభ్రపరిచే సమయంలో అనేక చర్మ సంబంధిత, శారీరక సమస్యలు వస్తాయని అలాంటి వాటిని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం వాటిల్లుతుందన్నారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంపు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న పలు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించామని అనంతరం వ్యాధి తీవ్రతను బట్టికి పలవురుకి మందులు సరఫరా చేశామన్నారు.

## నా వ్యాఖ్యలు వక్రీకరించారు : మంత్రి నారాయణ

విశాఖపట్నం (చైతన్యరథం) : ఎన్డీఏలో పార్టీలన్నీ కలిసే ఉన్నాయని మంత్రి నారాయణ అన్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి ఆయన విశాఖలో పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. 'పిఠాపురంలో సమస్యలు జీరో చేశామంటే.. వర్మను జీరో చేశామని మార్చారు. నా వ్యాఖ్యలు వక్రీకరించడం వారి దిగజారుడుతనానికి నిదర్శనం" అని మండిపడ్డారు. పిఠాపురం నియోజకవర్గంలో ఎలాంటి విభేదాలు లేవని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. పేటీఎం బ్యాచ్ ప్రచారాలను పట్టించుకోవాల్సిన పనిలేదని వ్యాఖ్యానించారు.

# స్మశానం అక్రమించిన వైసీపీ నేతపై తక్షణమే చర్యలు తీసుకోండి

**• అధికారులకు ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు**



**శ్మశానాన్ని ఆక్రమించిన వైసీపీ మాజీ కౌన్సిలర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోండి..**

చిలకలూరిపేట (చైతన్యరథం): తాము రుణం కోసం తాకట్టు పెట్టిన బంగారం స్థానంలో నకిలీ బంగారం ఉంచి, నమ్మకంతో తమను మోసగించారని, న్యాయస్థానం చెప్పినా వినకుండా, ఎన్నోఏళ్లుగా తమకు న్యాయం చేయకుండా కోర్టులు, కేసులంటూ బ్యాంక్ మేనేజ్ మెంట్ తమను అష్టకష్టాలు పెడుతోందని యడ్లపాడు మండలంలోని పలు గ్రామాల రైతులు తమ ఆవేదనను మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకొచ్చారు. శుక్రవారం ఆయన స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించి కూటమి నాయకులతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా యడ్లపాడు మండల కేంద్రంలోని ప్రధాన బ్యాంక్‌లో గోల్డ్ అప్రైజర్, మరికొందరు సిబ్బంది కలిసి చేసిన మోసానికి బ్యాంకు మేనేజ్ మెంట్ తమను వేధిస్తోందని, రుణాలు ఇవ్వకుండా.. తాకట్టులో ఉన్న బంగారం తిరిగివ్వకుండా ముప్పుతిప్పలు పెడుతోందని సదరు మండలంలోని పలు గ్రామాల రైతులు ప్రత్తిపాటికి తెలిపారు. రైతుల ఆవేదనపై స్పందించిన ఎమ్మెల్యే బ్యాంకు అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. ఎప్పుడో జరిగిన మోసం ఇప్పటికీ తేలకపోవడమేంటని.. సమస్య పరిష్కరించకుండా ఎన్నాళ్లు అమాయక రైతుల్ని ఇబ్బంది పెడతారని ప్రత్తిపాటి ప్రశ్నించారు. రోజుల వ్యవధిలో సమస్య పరిష్కరించాలని లేకుంటే రైతుల ఆగ్రహానికి మీరే మూల్యం చెల్లించాల్సి వస్తుందని, సమస్య త్వరగా పరిష్కరించకుంటే రైతులు బ్యాంకు వద్ద ధర్నా చేస్తామంటున్నారని ప్రత్తిపాటి అధికారులకు తేల్చిచెప్పారు. ఎవరూ అధైర్యపడవద్దని, సమస్య పరిష్కరించేలా చొరవ తీసుకుంటానని ప్రత్తిపాటి రైతులకు భరోసా ఇచ్చారు.

పట్టణంలోని 12, 13 వార్డుల పరిధిలోఆర్.సీ.ఎమ్ చర్చి ఎదురుగా ఉన్న హిందూ, క్రైస్తవ శ్మశానాన్ని ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టిన వైసీపీ మాజీ కౌన్సిలర్ షేక్ కాలేషావలి వ్యవహారంపై టీడీపీ నేతలు, స్థానికులు ప్రత్తిపాటికి ఫిర్యాదు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మాజీమంత్రికి ప్రధాన అనుచరుడిగా ఉన్న సెంట్రింగ్ మేస్త్రి అయిన కాలేషావలి శ్మశానాన్ని ఆక్రమించి షెడ్లు వేసి, వాటిని ఇతరులకు లీజుకు ఇచ్చాడని, కొంత స్థలాన్ని ఇతరులకు అమ్మినట్టు అగ్రిమెంట్లు సృష్టించాడని స్థానికులు ఎమ్మెల్యేతో చెప్పారు. సమస్యపై స్పందించిన ప్రత్తిపాటి... తక్షణమే కాలేషావలిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పోలీసుల సహకారంతో శ్మశానం మొత్తం రీ సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించి.. వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫానిని ఆదేశించారు. వైసీపీని ప్రజలు ఛీకొట్టినా.. వారు చేసిన ఆక్రమణలు మాత్రం ఇంకా ప్రజల్ని పీడిస్తూనే ఉన్నాయని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్మశాన ఆక్రమణ వెనక ఎవరున్నా వదిలిపెట్టనని, స్థానికులకు మొత్తం శ్మశానాన్ని త్వరలోనే అప్పగిస్తామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)లో ఎక్కువగా భూ సమస్యలే వస్తున్నాయని, వీటి పరిష్కారం నిమిత్తం త్వరలోనే నియోజకవర్గస్థాయి రెవెన్యూ సమీక్ష సమావేశం నిర్వహిస్తానని ఈ సందర్భంగా ప్రత్తిపాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమల రవి, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, టీడీపీ ముఖ్య నాయకులు, పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించే నాయకుడు చంద్రబాబు

**•టిడిపి రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షేక్ మహమ్మద్ నూర్**

అమరావతి (చైతన్యరథం): నాడు ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు హైదరాబాద్ కు మైక్రో సాఫ్ట్ కంపెనీని తీసుకురాగా నేడు నవ్యాంధ్రప్రదేశ్ విశాఖపట్నంకు గూగుల్ సంస్థను తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్‌లో చరిత్ర సృష్టించిన నాయకుడు నారా చంద్రబాబు నాయుడు తన పరిపాలన దక్షతను చూపించి నేడు రాజకీయ నాయకులకు మరియు భావితరాల రాజకీయ నాయకులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. నేటి యువతకు నారా లోకేష్ బాబు ఆదర్శమని ఐటీ శాఖ మంత్రిగా గూగుల్ సంస్థను విశాఖపట్నం రావడానికి ఆయన ఎనలేని కృషి చేశారని దీనికి లోకేష్ బాబుకు ప్రత్యేక గుర్తింపు లభించిందని మహమ్మద్ నూర్ పేర్కొన్నారు. నారా లోకేష్ దృఢమైన సంకల్పం, పట్టుదల మరియు నిరంతరం ప్రజా శ్రేయస్సు కోసం పరితపించే నాయకుడు నిరుద్యోగులకు బాసటగా నిలిచి ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే డీఎస్సీ సమర్థవంతంగా నిర్వహించి ప్రత్యేకమైన స్థానం సంపాదించుకున్నారు ఎందరో నిరుద్యోగుల కుటుంబాలకు వెలుగులు నింపారని చెప్పారు. గూగుల్ సంస్థ ద్వారా దాదాపుగా లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. చంద్రబాబునాయుడు సంక్షేమ మరియు అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ నారా చంద్రబాబునాయుడుకి మరియు లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నారని మహమ్మద్ నూర్ చెప్పుకొచ్చారు.

# గ్రామ... గ్రామానికి భారత్ నెట్ సేవలు

**●బీఎస్ఎన్ఎల్ సంస్థ పురోగతిపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష**



గుంటూరు / ఢిల్లీ (చైతన్యరథం): భారతదేశంలో ప్రతి మారుమూల గ్రామానికి భారత్ నెట్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతంలో పరిశ్రమలు రావడానికి కావలిసిన ఎకో సిస్టమ్స్ అభివృద్ధి చేయడానికి అనేక రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒకసారి ఎకో సిస్టమ్ ఏర్పాటు అయిన తర్వాత రాయితీలు ఇవ్వాల్సిన అవసరం ఉండదని చెప్పుకొచ్చారు. శుక్రవారం ఢిల్లీ వేదికగా మీడియాతో మాట్లాడారు పెమ్మసాని చంద్రశేఖర్. ప్రస్తుతం గూగుల్ డాటా సెంటర్ ( Google Data Center ) ఏర్పాటైన తర్వాత చాలా సంస్థలు ఆ ప్రాంతంలో పెట్టబడులు పెట్టడానికి ఆసక్తి చూపిస్తున్నాయని వివరించారు. బెంగళూర్ లాంటి ప్రాంతాల్లో ఒక ఎకో సిస్టం ఏర్పాటైంది.. ఆ ప్రాంతంతో విశాఖపట్నానికి పోలిక అవసరం లేదని స్పష్టం చేశారు. పోస్టల్, బీఎస్ఎన్ఎల్, తదితర సంస్థలను కామన్ మ్యాన్‌కు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు పెమ్మసాని చంద్రశేఖర్. ఖర్చులు ఎక్కువగా ఉండి, ఆదాయం తక్కువగా ఉండే పోస్టల్ డిపార్ట్‌మెంట్ బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. రూ.5 వేల కోట్ల నిధులతో పోస్టల్ సంస్థ నిలదొక్కుకునేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే కాలంలో పోస్టల్ సంస్థను ఆదాయం అందించే సంస్థగా తీర్చిదిద్దుతామని ఉద్ఘాటించారు పెమ్మసాని చంద్రశేఖర్. బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచడానికి దాదాపుగా 20 వేల కొత్త సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. వినియోగదారుల భద్రత కోసం సంచార్ సాతి యాప్ సేవలను అందిస్తున్నామని తెలిపారు. టెలికాం వినియోగదారులను ఫైనాన్షియల్ ఫ్రాడ్‌ల నుంచి రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల 327 యూనియన్ సమావేశం



విజయవాడ (చైతన్యరథం): దశాబ్దాల కాలంగా అపరిష్కృతంగా ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ దశలవారిగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్తు సంస్థ యాజమాన్యం ఉద్యోగుల జేఏసీ నాయకులను చర్చలకు పిలిచింది. ఈ నేపథ్యంలో విజయవాడ గుణదల 327 యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో విద్యుత్తు ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు అత్యవసర సమావేశం నిర్వహించారు. యాజమాన్యంతో చర్చలు విఫలమైతే తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు తెలిపారు.

# పేదల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకొస్తాం

**●విజయవాడలో పలువురికి తోడుపు బండ్లు, బ్యాటరీ ట్రై సైకిళ్లు అందజేసిన ఎమ్మెల్యే బొండా ఉమా**



విజయవాడ (చైతన్యరథం): నిరుపేదలై, బతుకుతెరువు కోసం రోడ్డు పక్కన జీవనం సాగిస్తున్న నిరుపేదలకు పీ-4 పథకంలో భాగంగా పలువురికి విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తోపుడు బండ్లు, అంగవైకల్యం కలిగిన వారికి బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేశారు. అనంతరం బొండా ఉమా మాట్లాడుతూ... తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, పేద వర్గాల ప్రజలకు నిరంతరం అండగా నిలబడటానికి అనేక కార్యక్రమాలను చేపడుతోంది. రాష్ట్రంలో, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు 'సూపర్ సిక్స్' పథకాలను అమలు చేస్తు ముఖ్యంగా, వృద్ధాప్య పెన్షన్ విషయంలో, గతంలో 3000 రూపాయలుగా ఉన్న పెన్షన్‌ను 4000 రూపాయలకు పెంచి, వృద్ధులకు ఆర్థిక భరోసా కల్పించామని అన్నారు. ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో గణనీయమైన సహాయాన్ని అందిస్తు ఈ పెంపుదల వృద్ధులకు గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి తోడ్పడుతుందని, దివ్యాంగులైన సోదర సోదరీమణుల కోసం, గతంలో 3000 రూపాయలుగా ఉన్న పెన్షన్‌ను 6000 రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చి ఆ హామీని నెరవేరుస్తూ, పెంచిన పెన్షన్‌ను ప్రతి నెలా ఉదయం 6 గంటలకే వారి ఇంటి వద్దకే అందజేస్తున్నామని అన్నారు. ఇది దివ్యాంగులకు ఆర్థికంగా మరింత స్థిరత్వాన్ని అందిస్తుంది. వారి దైనందిన అవసరాలను తీర్చడంలో సహాయపడుతుందని, అలాగే బెడ్‌రిడెన్ రోగులకు నెలకు 10 వేల రూపాయలు, బెడ్ మీద ఉన్నవారికి 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఈ సహాయం వారి వైద్య ఖర్చులను మరియు ఇతర అవసరాలను తీర్చడానికి ఉపయోగపడుతుందన్నారు. చిరు వ్యాపారులకు, తోపుడు బళ్ల మీద కాయగూరలు లేదా ఇతర వస్తువులు అమ్ముకునే వారికి ప్రభుత్వం పూర్తిగా అండగా నిలుస్తు ప్రభుత్వపరంగా గుర్తింపు కార్డులు మరియు 'స్ట్రీట్ వెండార్' లైసెన్స్‌లు అందిస్తున్నాం అని, ఈ లైసెన్స్‌లు పొందిన వారు, తమ ఆధార్ కార్డుతో బ్యాంకుకు వెళ్తే, ఎటువంటి హామీ లేకుండా 15,000 రూపాయల లోన్ పొందే అవకాశం కల్పిస్తున్నామని అన్నారు. పీ-4లో భాగంగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో ఇప్పటివరకు తన సొంత నిధులనుండి 200 తోపుడు బళ్లను పేద వర్గాల వారికి పంపిణీ చేశామని, ఇది పేదలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించడంలో మరియు వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో సహాయం అందిస్తున్నామని అన్నారు. ప్రతి పథకం పేదల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో రూపొందించబడిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు.

# పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం : ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం (చైతన్యరథం): పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని టీడీపీ ఎర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా సహాయం కోరిన ప్రతి ఒక్కరికి సాయం మంజూరు అవుతుందని అన్నారు. 33 మంది ఆపన్నులకు రూ. 32,58,671 లక్షల సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో టీడీపీ ప్రభుత్వం ముందుంటుందని అన్నారు.



# రామతీర్థం ఆలయ పవిత్రతను కాపాడండి

## ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపు

కొడవలూరు, (చైతన్యరథం): రామతీర్థం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటి ప్రమాణ స్వీకారం సందర్భంగా రామతీర్థం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి ఆలయ పాలక వర్గ మండలి సభ్యులు ఘన స్వాగతం పలికారు. వేద పండితులు పూర్ణకుంభంతో అపూర్వ స్వాగతం పలికారు. స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి తీర్ధ ప్రసాదాలు అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఆలయ పాలక మండలి విధులకు సంబంధించి ఆమె వివరిస్తూ తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి సభ్యురాలిగా తన అనుభవాలను తెలిపారు. ఆలయ పవిత్రత కాపాడే విషయంలో దేవస్థాన కమిటి ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. స్వామి వారి ఆస్థుల రక్షణకు ఆలయ కమిటి కృషి చేయాలని కోరారు. తన రాజకీయ ప్రస్థానం రామతీర్థం రామలింగేశ్వర స్వామి ఆశీస్సులతోనే మొదలైందన్నారు. తన తొలి ఎన్నికల ప్రచారం రామతీర్థం నుంచే ప్రారంభమైన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. స్వామి అనుగ్రహంతో ఆలయ పాలక మండలి సభ్యులుగా అవకాశం దక్కడం పూర్వజన్మ సుకృతమన్నారు. అర్చకులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వివాదాలకు తావివ్వకుండా నిస్వార్ధంగా పని చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆలయ కమిటి సభ్యులకు సూచించారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె గ్రామస్థులను కోరారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి శ్రీ రామలింగేశ్వర స్వామి అంటే ఎంతో భక్తి అని రాజకీయాలలోకి రాకముందు నుంచే ఈ ఆలయ అభివృద్ధిలో విపిఆర్ గారి భాగస్వామ్యం వుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహాయ సహకారాలతో టెంపుల్ టూరిజం కార్యక్రమంలో భాగంగా రామతీర్థం ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం అతిరాల సురేష్ కృష్ణ ఛైర్మెన్ గా 11 మంది సభ్యులతో నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ విజయలక్ష్మి, విడవలూరు మండల టిడిపి అధ్యక్షులు ఏటూరు శ్రీహరి రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఆడపల శ్రీధర్ రెడ్డి, ఆవుల వాసు, పాశం శ్రీహరి రెడ్డి, చెమకుల శ్రీనివాసులు, చెముకుల చైతన్య, పూండ్ల అచ్యుత్ రెడ్డి, సత్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గూగుల్ డేటా సెంటర్ గురించి ఎంత చెప్పినా తక్కువే

## ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్



నెల్లూరు, (చైతన్యరథం): నగరంలోని హారనాథపురంలో తన క్యాంపు కార్యాలయంలో ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ మన నవ్యాంధ్ర ప్రదేశ్ కు రావటం అత్యంత సంతోషకరమని అన్నారు. గూగుల్ ఆంధ్రకు వచ్చిందని గర్వపడాల్సింది పోయి వైసిపి నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. డేటా సెంటర్ ఆంధ్ర ప్రదేశ్‌కి రావటంతో ప్రపంచం మొత్తం మన రాష్ట్రాన్ని చూసి అసూయ పడుతుందని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ ఆంధ్ర ప్రదేశ్ కు రావటం చంద్రబాబుకు లోకేష్‌కు ఐటి రంగంలో ఉన్న అనుభవానికి నిదర్శనమని అన్నారు. దాదాపు కోటి ఇళ్లకు సరఫరా చేసే విద్యుత్తు గూగుల్ డేటా సెంటర్‌కు అవసరమని ఆ విద్యుత్తు ఇచ్చేందుకు ఆంధ్ర రాష్ట్రం సిద్ధంగా ఉందని అన్నారు. ఆదానీ డేటా సెంటర్ వారు పోర్టుతో కలిపి 15000 కోట్లు మాత్రమే పెట్టుబడి పెట్టారని గూగుల్ లక్ష 35 వేల కోట్లు పెట్టుబడి పెడుతుందని అన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టుబడులు పెడుతున్నాయంటే ప్రభుత్వంపై ఉండే నమ్మకమని అన్నారు. పరిశ్రమలు వస్తే వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని అన్నారు. గూగుల్ డేటా సెంటర్తో వైజాగ్ సౌత్ ఈస్ట్ ఏషియా మొత్తానికి ఒక హబ్ గా మారనుందని అన్నారు. డేటా సెంటర్ ఆంధ్రకు రావటం వైసిపి నాయకుడు విమర్శలు చేసినంత సులభం కాదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. భవిష్యత్తులో ఆంధ్ర రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వ ఉండబోతుందని పెట్టుబడులు పెడితే సురక్షితంగా ఉంటుందని నమ్మి నిర్ధారించుకుని గూగుల్ పెట్టుబడులు పెడుతుందని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ విషయంలో రాజకీయ నాయకుల పిచ్చికూతలు ఎవరూ నమ్మవద్దని, చంద్రబాబు లోకేష్ల జీవితంలో ఇది ఒక మైలు రాయిలా నిలవబోతుందని అన్నారు. ఇప్పుడు హైటెక్ సిటీ గురించి ఎలా మాట్లాడుకుంటున్నారో భావితరాలు గూగుల్ గురించి మాట్లాడుకుంటాయని అన్నారు. గూగుల్ డేటా సెంటర్ విషయంలో ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు.

# పని చేస్తేనే పంచాయతీలకు ఆదాయం

## నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి



నెల్లూరు, (చైతన్యరథం): క్షేత్ర స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు కష్టపడి పని చేస్తేనే పంచాయితీలకు ఆదాయం వస్తుందని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఎల్ఆర్ఎస్ పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. లే అవుట్ దారులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి డిప్యూటీ ఎంపిడిఓ, డిఎల్పివో, పంచాయతీ కార్యదర్శులులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోటంరెడ్డి మాట్లాడారు. ల్యాండ్ రెగలైజేషన్ స్కీమ్ పై ప్రధానంగా అధికారులతో ఆయన చర్చించి పలు సూచనలు చేశారు. ప్రజల సౌలభ్యం కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఈ స్కీమ్ ను అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. మంత్రి నారాయణ సహకారంతో నుడా అభివృద్ధి చెందుతుందన్నారు. తీసుకొచ్చేందుకు ఆయన ఎంతగానో కృషి చేశారని తెలిపారు.చాలా మంది ఈ స్కీమ్ ను సద్వినియోగం చేసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని తెలిపారు. నుడా పరిధిలోని కొన్ని ప్రాంతాలలో ఎల్ఆర్ఎస్ స్కీము ను సద్వినియోగం చేసుకోవడం లేదన్నారు. ప్రజా సేవలో మనమంతా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా భూముల చట్టబద్ధత సాధించడం వల్ల నగరాభివృద్ధి, ప్రణాళికాబద్ధమైన నిర్మాణం, భవిష్యత్తు వసతుల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నుడా సెక్రటరీ అల్లంపాటి పెంచల రెడ్డి. ఆఫీసర్ హిమబిందు, కాలేషా, ఏపీవో చంద్ర, రాజు పాల్గొన్నారు.

# గూగుల్ రాక ఏపీ అభివృద్ధి సూచిక

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్



అమరావతి, (చైతన్యరథం): అభివృద్ధి పునరుద్ధరణతో రాష్ట్ర ప్రజల్లో కొత్త ఆశలు, ఉత్సాహం కనిపిస్తున్నాయని ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు డాక్టర్ కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చిన సందర్భంగా ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. "విధ్వంస పాలనకు ముగింపు పలికిన ఆంధ్రప్రదేశ్ ప్రజలు, అభివృద్ధి, పారదర్శకతకు కట్టుబడిన సీఎం చంద్రబాబు నాయుడిపై మళ్లీ విశ్వాసం ఉంచినందుకు రామరాజ్య స్ఫూర్తిని ప్రతిబింబించే పాలన చేస్తున్నారన్నారు. అమరావతిని కలల రాజధానిగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కూటమి ప్రభుత్వం పట్టుదలగా ముందుకు సాగుతోందన్నారు. ఇటీవల సీఆర్డీఏ కార్యాలయం నిర్మాణం పూర్తవడం అమరావతి పునరుద్ధరణలో చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. "చంద్రబాబు దూరదృష్టి, నాయకత్వం, అమరావతిపై ఆయనకు ఉన్న అచంచలమైన నిబద్ధత రాష్ట్ర ప్రజల్లో మరోసారి విశ్వాసాన్ని పునరుద్ధరించింది. రాష్ట్రం పెట్టుబడుల కేంద్రంగా అవతరిస్తోందని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషితో అనేక అంతర్జాతీయ కంపెనీలు ఆంధ్రప్రదేశ్ వైపు ఆకర్షితమవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ప్రపంచ ఐటీ దిగ్గజం గూగుల్ సంస్థ విశాఖపట్నంలో డేటా సెంటర్‌ను ప్రారంభిస్తుండటం దేశాభివృద్ధికే గర్వకారణమని అన్నారు. గూగుల్ సెంటర్ ద్వారా వేలాది మంది యువతకు ఐటీ, డిజిటల్ సేవలు, సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. విశాఖలో గూగుల్ అడుగుపెట్టడం రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే చంద్రబాబు విజన్‌కు నిదర్శనం," అని అన్నారు.

# మాయల మరాఠి 'జోగీ' ఇకనైనా తప్పు ఒప్పుకో

## ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి సూచన

మదనపల్లి, చైతన్యరథం): కల్తీ మద్యం వ్యవహారంలో అడ్డంగా దొరికపోయిన ఓ మాయలమరాఠీ ఇకనైనా తప్పు ఒప్పుకోవాలని ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి సూచించారు శుక్రవారం గురుమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో గురుమూర్తి మాట్లాడుతూ జోగి వ్యవహారంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కల్తీ మద్యం వ్యవహారంలో అడ్డంగా బుక్కైన వైఎస్ఆర్సీపీకి చెందిన మాజీ మంత్రి జోగి రమేష్ ఈ వ్యవహారం పక్కతోవ పట్టించడానికి, గత రెండు రోజులుగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్, బీసీ మంత్రుల గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. చంద్రబాబును మాయల మరాఠీగా జోగి రమేష్ అభివర్ణిస్తూ మాట్లాడే జోగి అతనే మాయల మరాఠి అన్న సంగతి మర్చిపోయాడేమో అంటూ ధ్వజమెత్తారు. ఎల్లో మీడియా అసత్య కథనాలు రాస్తుందని జోగి రమేష్ మాట్లాడుతున్నాడు. వైయస్సార్సీపి అధినేత జగన్మోహన్ రెడ్డి, ఆ పార్టీకి చెందిన నాయకులే మాయల మరాఠీలని, అసత్య ప్రచారాలు చేయడంలో వైసీపీ నాయకులు నిష్ణాతులని ప్రజలందరికీ తెలుసన్నారు. వివేకానందరెడ్డిని అత్యంత వాశవికంగా హత్య చేయడమే కాకుండా.. నారాసుర రక్త చరిత్ర అని ఆ రోజు సాక్షి పత్రికలో అసత్య కథనాలు రాసి, సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేసి సార్వత్రిక ఎన్నికల్లో లబ్ధి పొందిన జగన్ అధికారంలోకి రాగానే సిబిఐ ఎంక్వయిరీ వద్దని స్వయంగా జగనే చెప్పారని, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి చెందిన పింక్ డైమండ్ చంద్రబాబు ఇంట్లో ఉందని అల్లరి చేసిన సాక్షి దినపత్రిక, వైఎస్ఆర్సిపి నేతలు అధికారంలోకి రాగానే ఎందుకు విచారణ జరిపించలేదని, కోడి కత్తి డ్రామాలు ఆడిన జగన్మోహన్ రెడ్డి కంటే మాయల మరాఠీ ఇంకెవరున్నారంటూ దుమ్మెత్తి పోశారు.

### అసత్యాలకు పేటెంట్ వైకాపా నాయకులు

అసత్య ప్రచారాలు చేయడంలో వైసిపి నాయకులకు కొట్టిన పిండని ప్రజలందరికీ తెలుసని, అది వారికి పేటెంట్ హక్కు అన్నారు. అధికార దాహంతో ఉన్న జగన్మోహన్ రెడ్డి తండ్రి శవాన్ని పక్కన పెట్టుకుని సంతకాల సేకరణ పేరిట డ్రామాలాడిన విషయం ప్రజలు ఇంకా మరిచిపోలేదని, మాజీ మంత్రి జోగి రమేష్ నారావారి సారా పల్లెల్లో పారుతోందని మాట్లాడుతున్నాడని, గత ఐదేళ్లలో రాష్ట్రంలో కల్తీ మద్యం, కల్తీ సారా వైఎస్ఆర్సిపీ ప్రభుత్వం ఏరులై పారించిందని, మద్యం దుకాణాల్లో డిజిటల్ ట్రాన్సాక్షన్ లేకుండా కల్తీ మద్యం మించి వేలకోట్లు దోచుకున్నారని, వైయస్సార్సీపి ప్రభుత్వం అమ్మించిన కల్తీ మద్యంతో రాష్ట్రవ్యాప్తంగా 30 వేలకు మందికి పైగా ప్రజలు మృత్యువాత పడ్డారని, లక్షలాదిమంది రోగాల బారిన పడ్డారని ఆగ్రహంవ్యక్తం చేశారు.



# మడకశిరలో కేంద్ర మంత్రి సోమన్న పర్యటన



మడకశిర, (చైతన్యరథం): కేంద్ర రైల్వే, జలవనరుల శాఖల మంత్రి సోమన్న రాయదుర్గం, తుమకూరు రైల్వే పనుల పురోగతిని నేరుగా పరిశీలించేందుకు పావగడ మడకశిరలను సందర్శించారు. పనుల పురోగతి గురించి అధికారులతో చర్చించారు. మడకశిర మీదుగా పావగడకు వెళ్లే సందర్భంలో శాసనమండలి మాజీ సభ్యులు గుండుమల తిప్పేస్వామి స్వగృహానికి వచ్చారు. అనంతరం పావగడలో పనుల పురోగతిని పరిశీలించి మధ్యాహ్నం మడకశిర పట్టణ సమీపంలో జరుగుతున్న రైల్వే పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించి అధికారులు నాయకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, రాష్ట్రవక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ ఛైర్మన్ కన్వీనర్లు జడ్పీటీసీ సభ్యుడు, కౌన్సిలర్లు క్లస్టర్ ఇన్చార్జులు సింగల్ విండో అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఇదిలావుండగా కేంద్ర ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కలిశారు. మర్యాదపూర్వకంగా భేటి అయ్యారు. శ్రీరామ్‌తో పాటు హిందూపురం ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, పావగడ ఎమ్మెల్యే వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులు భేటీలో పాల్గొన్నారు. ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాలలోని పలు రైల్వే సమస్యలను మంత్రి సోమన్న దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే వీటిపై వినతిపత్రాలు కూడా ఇచ్చినట్టు చెప్పారు. వీటిపై మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. పరిటాల కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్న నేపథ్యంలో మంత్రి సోమన్న, ఎమ్మెల్యే పరిటాల సునీతతో పాటు ఇతర కుటుంబసభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నారు.



పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కూటమి ప్రభుత్వంలో పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పంచాయతీరాజ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు.

# అన్ని చెరువులకూ హంద్రీనీవా నీరందిస్తాం

## యర్రగుంట వద్ద ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పరిటాల సునీత



రాప్తాడు, (చైతన్యరథం): గత వైసీపీ ప్రభుత్వంలో హంద్రీనీవా ద్వారా ఒక్క చెరువుకైనా అదనంగా నీరు అందించారా అంటూ రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రశ్నించారు. రాప్తాడు మండలం యర్రగుంట గ్రామం సమీపంలో హంద్రీ, నీవా నీటితో పొంగి పొర్లుతున్న చెక్ డ్యాంను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. పండమేరు వాగు ద్వారా అనంతపురం చెరువుకు వెళ్తున్న సాగునీటిని పరిశీలించారు. వాగు మధ్యలో నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏమైనా ఉన్నాయా అన్నది ఆరా తీశారు. ఎక్కడా నీటి వృథా కాకుండా చూడాలన్నారు. ఎక్కడైన నీటి వృథా జరుగుతోంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో అవకాశం ఉన్న ప్రతి చెరువుకు నీరు అందిస్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు. హంద్రీనీవా నీటిని కుప్పానికి తీసుకెళ్తున్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. అదే నిజమైతే ఇప్పుడు చెరువులకు నీళ్ళు ఎలా వస్తున్నాయని నిలదీశారు. రైతులు ఎవరూ ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని.. అనంతపురం జిల్లాకు పూర్తి స్థాయిలో నీరు ఇవ్వడంతోపాటు కింది ప్రాంతాలకు తీసుకెల్తారన్నారు. ఇంకా ఎక్కువ చెరువులకు నీరు ఇవ్వాలని జలవనరుల శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశామని, త్వరలో వాటికి కూడా నీరు ఇస్తామని ఎమ్మెల్యే సునీత అన్నారు.

# ఆదర్శ గ్రామంగా అమడుగూరు

## ఎమ్మెల్యే సిందూర, మాజీమంత్రి పల్లె

పుట్టపర్తి, (చైతన్యరథం): పుట్టపర్తి నియోజకవర్గం లోని ఆమడగూరును మోడల్ గ్రామంగా తీర్చిదిద్దేందుకు స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా ఎంపిక చేసుకున్నారు. అమడుగురు గ్రామాన్ని ఎమ్మెల్యే దత్తకు తీసుకొని మోడల్ విలేజ్ గా సమగ్ర అభివృద్ధిని చేపట్టేందుకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి నియోజకవర్గ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అమడ గూరు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులతో ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా శాఖల వారీగా ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టవచ్చు సంబంధిత శాఖల అధికారులతో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం ప్రజల సమస్యలపై ప్రజా గ్రీవెన్స్ నిర్వహిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వెల్లడించారు. అమడ గూరు గ్రామ సమగ్ర అభివృద్ధిపై వచ్చే సమావేశాన్ని అక్కడే నిర్వహిస్తామని అంతలోగా సంబంధిత అధికారులు తగిన నివేదికలతో రావాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు.

### కలెక్టతో భేటీ

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 100వ జయంతి వేడుకల సందర్భంగా పుట్టపర్తిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. పనుల ప్రగతి పై కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ డిఈ నరసింహామూర్తి ఇంజనీర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



# మార్చి నెలాఖరుకు 2300 మందికి టిడ్కో ఇళ్ళు అందిస్తాం

## అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ వెల్లడి

అనంతపురం, (చైతన్యరథం): చిన్మయనగర్ సమీపంలోని టిడ్కో ఇళ్లను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ మున్సిపల్, టిడ్కో, హౌసింగ్ అధికారులతో కలసి పరిశీలించారు. గతంలో చెప్పిన పనులు ఎంత వరకు వచ్చాయని ప్రశ్నించారు. సరైన సమాచారం ఇవ్వకపోవడంపై టిడ్కో హౌసింగ్ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు ఇప్పుడు జరగకూడదన్నారు. టిడ్కో ఇళ్లకు జగన్ రెడ్డి కేవలం రంగులు మాత్రమే మార్చారన్నారు. 2019లో తాము ఎక్కడి వరకు నిర్మాణాలు చేశామో అక్కడే అన్నీ ఆగిపోయాయన్నారు. కనీసం ఒక్క డ్రైన్ గాని ఒక్క కిటికీ కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మొత్తం 48బ్లాకులతో గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణాలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. టీడీపీ హయాంలోనే 27బ్లాక్ లు పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగిందన్నారు. ఐదేళ్ల పాటు లబ్ధిదారులు బ్యాంకులు ఈఎంఐలు, అప్పులు కట్టలేక ఇబ్బందులు పడ్డారువారికి ఇళ్లు దక్కలేదన్నారు. అప్పుల పాలయ్యేలా జగన్ హయంలో చేశారు మళ్లీ మా ప్రభుత్వం వచ్చాక టిడ్కో ఇళ్ల నిర్మాణం పునఃప్రారంభమైందిమొత్తం ఇళ్ల నిర్మాణాలకు రాష్ట్రంలో 5వేల కోట్లు కావాలిరాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా 4500కోట్లు రుణాలు తీసుకున్నాం

అర్బన్ నియోజకవర్గంలో 5100ఇళ్ల నిర్మాణం చేపట్టామన్నారు. 2300ఇళ్లలో 1620పూర్తి స్థాయిలో నిర్మాణం జరిగిందని మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. వైసీపీ హయాంలో అక్రమంగా జాబితాలో చేర్చిన వారికి ఇళ్ళ ఇచ్చేది లేదన్నారు. పేర్లు, స్కీంలు మార్చే పరిస్థితి తమ ప్రభుత్వంలో ఉండవన్నారు. ప్రజలకు మంచి జరిగే అన్ని కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

# జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకూ మేలు

## కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వెల్లడి

కోవూరు, (చైతన్యరథం): జీఎస్టీ 2.0 సంస్కరణలతో పన్నుల విధానాన్ని సులభతరమై ప్రజలకు ప్రత్యక్ష లాభాలు పెరిగి వ్యాపారులపై పన్నుల భారాన్ని తగ్గిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. ఇందుకూరు పేట మండల కేంద్రంలో ఆమె వ్యాపారస్థులు, రైతులకు జిఎస్టి 2.0 ప్రయోజనాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు మాట్లాడుతూ ట్రాక్టర్ల పై 12 శాతం జీఎస్టీ 5 శాతానికి తగ్గడంతో వ్యవసాయ రంగానికి ఎంతో మేలు జరిగిందన్నారు. హార్వెస్టర్, రోటావేటర్ లాంటి వ్యవసాయ పరికరాలు, ఫర్టిలైజర్స్ మరియు పురుగు మందులపై గతంలో 12 నుంచి 18 శాతం వున్న %+ూ% యిప్పుడు 5 శాతానికి తగ్గడంతో రైంతాంగం హర్షం వ్యక్తం చేస్తుందన్నారు. రొయ్యల సాగుకు అవసరమైన డీజిల్ ఇంజన్లు, ఏరియేటర్లు, స్పింక్లర్ల పై 12 శాతం వున్న జీఎస్టీ 5 శాతానికి తగ్గిందన్నారు. చేపల, రొయ్యల చెరువుల్లో నీటి నాణ్యతకు ఉపయోగించే అమ్మోనియా వంటి రసాయనాలు ఇతర మినరల్స్ పై వున్న 12 శాతం జిఎస్టిని 5 శాతానికి తగ్గించి ఆక్వా రంగానికి అండగా నిలిచారన్నారు. ఆక్వా కల్చర్ కు చెందిన చాలా ఇన్‌పుట్స్ పై 12 వున్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించి ఆక్వా రంగాన్ని ఆదుకున్న ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఆమె ధన్యవాదాలు తెలియ చేశారు. ఉప్పు, పప్పు, సబ్బులు, షాంపూలు, పేస్టులు తదితర నిత్యావసర సరకుల ధరలు తగ్గడంతో పేద, మధ్య తరగతి వర్గాల నెల వారి బడ్జెట్ లో నెలకు 3 నుంచి 5 వేల రూపాయలు అదా అవుతాయన్నారు. జీఎస్టీ 2.0 సంస్కరణల ద్వారా సమాజంలోని ప్రతి వర్గానికి మేలు జరిగిందన్నారు. జడ్పీ వైస్ చైర్మన్ విజయ లక్ష్మీ, జీఎస్టీ కావలి జోన్ అధికారి జ్యోతి, తహసీల్దారు గోపి కృష్ణ, ఎంపీడీవో నాగేంద్ర, ఇందుకూరుపేట టీడీపీ అధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్ రెడ్డి, రావెళ్ల వీరేంద్ర నాయుడు, చెంచు కిషోర్ యాదవ్, దేవిరెడ్డి. రవీంద్ర రెడ్డి, సూదలగుంట నాగార్జున, బాబు, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాసులు రెడ్డి, జనసేన నాయకులు గుడి. హరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి వేడుకల సందర్భంగా చిత్రావతి బ్యూటీఫికేషన్, పార్కుల ఏర్పాటుతో అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

చైతన్యరథం

# వారు అర్థం చేసుకోకపోతే నేనేం చేయాలి

## - ఇన్ఫోసిస్ నారాయణ దంపతులపై కర్ణాటక సీఎం అసహనం

కర్ణాటకలో కొనసాగుతున్న సామాజిక, ఆర్థిక సర్వేపై ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు ఎన్.ఆర్ నారాయణ మూర్తి దంపతులకు కొన్ని అపోహలు ఉన్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఇది వెనకబడిన వర్గాల సర్వే అనే అభిప్రాయంతో వాళ్లు ఉన్నారని చెప్పారు. ఈ సర్వేను నారాయణమూర్తి దంపతులు తిరస్కరిస్తూ తమది వెనుకబడిన వర్గాలకు చెందిన కుటుంబం కాదని, ఈ సమీక్షలో పాల్గొనటం వల్ల కమిషన్‌కు ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం చేకూరదని వివరణ ఇవ్వడంపై సీఎం ఆయన స్పందించారు. "ఇది వెనకబడిన తరగతుల సర్వే కాదు. ఏడు కోట్ల జనాభా సర్వే అని 20 సార్లు చెప్పాం. వాళ్లు ఏది కావాలంటే అది రాసుకోనివ్వండి. ఈ సర్వే దేని గురించి అనేది ప్రజలు అర్థం చేసుకోవాలి. వాళ్లు (నారాయణమూర్తి దంపతులు) అర్థం చేసుకోలేకపోతే నేనేం చేయాలి" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆర్థికంగా వెనకబడిన మహిళలకు నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. అయితే, ఈ పథకాల్లో అగ్రవర్ణ మహిళలు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్న మహిళలు లేరా? అని సీఎం ప్రశ్నించారు. ఈ సర్వేపై మంత్రులు అనేకసార్లు స్పష్టమైన ప్రకటనలు చేసినప్పటికీ వారికి ఆపోహలు తొలగిపోలేదన్నారు. ఇప్పుడు కేంద్రం కూడా కుల గణనతో ముందుకు వస్తోందని, అప్పుడు వాళ్లు (మూర్తి దంపతులు) ఏం సమాధానం చెబుతారని అన్నారు. వాళ్ల దగ్గర తప్పుడు సమాచారం ఉందని భావిస్తున్నానని చెప్పారు.



### ఆర్ఎస్ఎస్ గురించి కాదు..

రాష్ట్రంలో నాయకత్వం మారే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయని ఆడిగిన ప్రశ్నకు సీఎం బదులిచ్చారు. మార్పు అనేది విప్లవం కాదన్నారు. సందర్భం లేకుండా ఎప్పుడూ ఇటువంటి వాదనలు వస్తూనే ఉంటాయని, వాటిని పట్టించుకోవద్దన్నారు. ఇక ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, కాలేజీల్లో ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలను నిషేధిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీఎం సమర్థించారు. ఇది ఆర్ఎస్ఎస్ సంస్థ గురించి కాదని, ఇటువంటివి నిర్వహించుకోవాలంటే ఏ సంస్థ అయినా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు.

# యుద్ధ చరిత్రలో గుర్తుండిపోయే 93,000

## పాక్‌తో అప్పుడు భారత్, ఇప్పుడు ఆఫ్ఘాన్ రికార్డు స్కోర్లు

పాకిస్థాన్, అఫ్గానిస్థాన్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం రెండు దేశాల మధ్య కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినా.. అది ఎంతవరకు కొనసాగుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ సమయంలో నెట్టింట్లో ఈ ఘర్షణల్లో భాగంగా పాక్ నుంచి స్వాధీనం చేసుకున్న ట్యాంకర్లతో పాటు సరిహద్దు స్థావరాల నుంచి పారిపోయిన పాక్ సైనికుల దుస్తులను అఫ్గాన్ ప్రదర్శించినట్టుగా కొన్ని దృశ్యాలు వైరల్ అయ్యాయి. క్షేత్రస్థాయిలో ఎవరు గెలిచినా... ఆన్లైన్ ప్రచారంతో మాత్రం అఫ్గాన్ గెలిచింది. కొందరు ఆ దేశ యాక్టివిస్టులు 93,000 2.0 అని పోస్టులు పెట్టారు. ఆ నంబర్‌కు భారత్‌తో సంబంధం ఉంది. 1971, డిసెంబర్లో భారత లెఫ్టినెంట్ జనరల్ జగ్జీత్ సింగ్ అరోడా, ఇతర సైన్యాధికారుల సమక్షంలో పాక్ లెఫ్టినెంట్ జనరల్ ఆమీర్ అబ్దుల్లా నియాజీ లొంగుబాటు పత్రంపై సంతకం చేశారు. ప్రస్తుతం ఆ చిత్రాన్ని నెటిజన్లు షేర్ చేస్తున్నారు. అప్పుడు 93, 000 మంది పాక్ సైనికులు భారత్ ముందు లొంగిపోయారు, "అప్పుడు భారత్ ఎదుట, ఇప్పుడు అఫ్గాన్ ముందు 'టీమ్ 93, 000 విషయంలో అప్పుడూ ఇప్పుడూ ఏమీ మారలేదు. భవిష్యత్తులో భారత్ రికార్డును అఫ్గాన్ బ్రేక్ చేస్తుందేమో" అని నెటిజన్లు పోస్టులు పెట్టారు..

### ఫీల్డ్ మార్షల్ మానెక్ షా వ్యూహం దెబ్బకు కంగుతిని..

1971లో తూర్పు పాకిస్థాన్లో మొదలైన స్వాతంత్ర్య పోరు భారత్, పాక్ మధ్య యుద్ధానికి దారి తీసింది. భారత్ సైన్యం పాక్‌ను ఓడించడంతో బంగ్లాదేశ్ ఏర్పాటుకు దారితీసింది. ఆ విజయానికి గుర్తుగా మనం ఏటా డిసెంబర్ 16న విజయ్ దివస్‌ను నిర్వహిస్తున్నాం. అప్పటి మన ఆర్మీ చీఫ్, ఫీల్డ్ మార్షల్ మానెక్ షా పటిష్ఠ వ్యూహ రచన జరిపి, విజయాన్ని భారత్ పరం చేశారు. 93,000 మందితో కూడిన పాకిస్థాన్ దళం భారత సైన్యం ముందు లొంగిపోయింది. ఈ సంఘటన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అతి పెద్ద లొంగుబాటుగా చరిత్రలో నిలిచి. మన సైన్య పరాక్రమాన్ని



ప్రపంచానికి చాటింది.

### పాక్-అఫ్గాన్ ఘర్షణలు....

అఫ్గాన్ భూభాగాన్ని ఉపయోగించుకుంటున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు, పాక్ ఖైబర్ పుంఖ్వాలోని ఓరక్జాయ్ జిల్లాలో ఇటీవల దాడులు చేయగా పలువురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో గత గురువారం ఆఫ్గాన్ రాజధాని కాబుల్‌లో పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ పేలుళ్లకు పాకిస్థాన్ కారణమని తాలిబన్ ప్రభుత్వం ఆరోపించింది. అప్పుడు అఫ్గాన్ విదేశాంగమంత్రి భారత్ పర్యటనలో ఉండటం గమనార్హం. ఉగ్రవాదుల ఏరివేత పేరుతో తమ సరిహద్దుల్లో దాడులు చేసిన దాయాదిపై అఫ్గాన్ కూడా అదే స్థాయిలో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో 38 మంది పాక్ సైనికులు మరణించినట్లు తాలిబన్ నేతృత్వంలోని ప్రభుత్వం వెల్లడించింది. తర్వాత కూడా ఆ ఘర్షణలు కొనసాగాయి. భారత్ ఆదేశాల మేరకే తమపై దాడులు జరిగాయని పాక్ ఆరోపించింది. ప్రస్తుతానికి ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది.

# సుప్రీంకోర్టును కుదిపిన సైబర్ మోసం



ఇటీవల సైబర్ నేరగాళ్లు ఎంచుకొన్న కొత్త పంథా డిజిటల్ అరెస్టులు. దీని పేరు చెప్పి ఆవతలి వ్యక్తులను భయాందోళనకు గురిచేస్తూ పెద్ద మొత్తంలో సొమ్ములు కాజేస్తున్నారు. దేశంలో ఈ డిజిటల్ అరెస్టు మోసాలు పెద్ద ముప్పుగా మారాయి. తాజాగా ఈ మోసాలపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. సుమోటోగా తీసుకున్న ఓ కేసు విచారణ సందర్భంగా కేంద్రం, సీబీఐలకు వారి స్పందన తెలపాలని న్యాయస్థానం ఆదేశించింది.

హరియాణాలోని అంబాలాకు చెందిన 73 ఏళ్ల ఓ మహిళ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ ఫిర్యాదు పత్రం రాశారు. అందులో.. తనను డిజిటల్ అరెస్టు చేయమని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసినట్లు ఉన్న ఒక పత్రాన్ని నేరగాళ్లు తనకు చూపించారన్నారు. కోటి రూపాయలు ఇస్తే ఈ అరెస్టు నుంచి బయటపడొచ్చని వారు బెదిరింపులకు పాల్పడ్డారని ఆమె తెలిపారు, కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లుగా నకిలీ పత్రాలు చూపించి నేరగాళ్లు సొమ్ములు కాజేయడాన్ని సీజేఐతో సహా సీనియర్ న్యాయమూర్తులు తీవ్రంగా పరిగణించారు. అంబాలా కేసును న్యాయస్థానం సుమోటోగా తీసుకోగా జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోర్మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం శుక్రవారం దీనిపై విచారణ జరిపింది.

ఈ సందర్భంగా న్యాయమూర్తులకు సంబంధించి నకిలీ సంతకాలు, సుప్రీం. హైకోర్టులు ఆదేశాలు. జారీ చేసినట్లు పత్రాలు చూపించి ఇలాంటి నేరాలకు పాల్పడటం వల్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం దెబ్బతింటుందని ధర్మాసనం పేర్కొంది. వీటిని సాధారణమైన మోసాలుగా పరిగణించలేమని వ్యాఖ్యానించింది. ఇలాంటి నేరాలను బయటపెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర పోలీసుల మధ్య సమన్వయం అవసరమని అభిప్రాయపడింది. ఇక, అంబాలా కేసుకు ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని అటార్నీ జనరల్‌ను స్థానిక సైబర్ క్రైమ్ విభాగానికి సూచించింది. మరోవైపు ఇదే కేసుకు సంబంధించి స్పందన

# ఎన్నికల ఎత్తుల్లో సమిధగా మారిన నటుడు మనోజ్

## తనను అన్యాయంగా నెట్టింట్లోకి లాగుతున్నారని ఆవేదన



బిహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు. ఓటర్లను ఆకట్టుకునేందుకు కొత్తకొత్త ఎత్తులు వేస్తున్నాయి. ప్రముఖ నటుడు మనోజ్ బాజ్ పేయ్ లాలూ ప్రసాద్ యాదవ్ పార్టీ ఆర్జేడీ తరపున ప్రచారం చేస్తున్నట్టుగా ఉన్న వీడియోను ఆయన తనయుడు తేజస్వీ యాదవ్ షేర్ చేశారు. అది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దానిపై మనోజ్ స్పందిం చారు. అది నకిలీ వీడియో అని, అందులో ఉన్నది తాను కాదని స్పష్టం చేశారు. ఈ నటుడి స్వరాష్ట్రం బిహార్ కావడం గమనార్హం.

"నాకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తెలియజేస్తున్నాను. నెట్టింట్లో చక్కర్లు కొడుతోన్న వీడియో నకిలీది. ఇలా వక్రీకరించిన కంటెంట్‌ను వ్యాప్తి చేయడం ఆపాలని ఈ సందర్భంగా కోరుతున్నాను" అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు, ఆర్జేడీ ఐటీ సెల్ ఆ వీడియోను రూపొందించినట్టు తెలుస్తోంది. నటుడు అభ్యంతరం తెలపడంతో ఆ తర్వాత దానిని తొలగించారు. మనోజ్ గురించి 2022 నుంచే ఇలాంటి వార్తలు వస్తున్నాయి. ఆ ఏడాది అనారోగ్యానికి గురైన లాలూను పరామర్శించేందుకు ఆయన నివాసానికి మనోజ్ వెళ్లారు. అప్పుడు మాజీ సీఎం కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ చేయించుకున్నారు. ఆ భేటీ గురించి తెలియజేస్తూ తేజస్వీ యాదవ్ ఫొటోలు షేర్ చేశారు. ఆ తర్వాత నుంచి మనోజ్ ఆర్జేడీలో చేరతారనే ప్రచారం జరిగింది. అప్పట్లో అదే ప్రశ్న ఆయన్ను అడగ్గా.. "నేను బిహార్ వెళ్లినప్పుడు ఆర్జేడీ చీఫ్ లాలూతో పాటు ఆయన కుమారుడు తేజస్విని కలిశాను. అప్పటి నుంచి నేను రాజకీయాల్లో చేరతాననే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 200 శాతం నేను అలా చేయను. పాలిటిక్స్‌లో చేరడం అన్న ప్రశ్నే తలెత్తదు" అని సమాధానం ఇచ్చారు. ఇటీవల కాలంలో తమ వాయిస్, ఫొటోలు, వీడియోలను తమ అనుమతి లేనిదే వాడకుండా చూడాలని పలువురు ప్రముఖులు కోర్టులను ఆశ్రయిస్తోన్న సంగతి తెలిసిందే.

# గుజరాత్ మంత్రిగా క్రికెటర్ భార్య

## కొత్త క్యాబినెట్‌లో ప్రమాణస్వీకారం చేసిన రవీంద్ర జడేజా సతీమణి



గుజరాత్లో ముఖ్యమంత్రి మినహా మిగతా మంత్రులంతా రాజీనామా చేయడంతో శుక్రవారం నూతన క్యాబినెట్ ఏర్పాటు అయింది. గుజరాత్లోని గాంధీ నగర్లో నేడు 26 మంది సభ్యుల కొత్త మంత్రివర్గం ప్రమాణ స్వీకారం చేసింది. వారిలో క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య, గుజరాత్ ఎమ్మెల్యే రివాబా జడేజా కూడా ఉన్నారు.

గురువారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ మినహా గుజరాత్ మంత్రులందరూ తమ రాజీనామాలను సమర్పించారు. వ్యవస్థాగత, రాజకీయ సవాళ్లను ఎదుర్కొనే లక్ష్యంతో రాష్ట్ర క్యాబినెట్ను పునర్వ్యవస్థీకరించాలనే ప్రణాళికలో భాగంగా ఈ రాజీనామా ప్రక్రియ చోటుచేసుకున్నట్లు పార్టీ నేతలు మీడియాకు వెల్లడించారు. గుజరాత్ అసెంబ్లీలో సభ్యుల సంఖ్య 182. నిబంధన ప్రకారం.. మంత్రుల సంఖ్య 27 వరకు ఉండొచ్చు.

### రివాబా జడేజా..

1990లో రాజ్కోట్లో జన్మించిన రివాబా. ఆత్మియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2016 ఏప్రిల్ 17న భారత క్రికెటర్ రవీంద్ర జడేజాను వివాహం చేసుకున్నారు. 2019లో భాజపాలో చేరారు. 2022 గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో జామ్నగర్ నార్త్ నుంచి పోటీ చేసి గెలుపొందారు. రాజ్పుత్ వర్గానికి చెందిన ఆమె కమలదళంలో చేరడానికి ముందు 2018లో కర్ణిసేన మహిళా విభాగానికి చీఫ్ గా వ్యవహరించారు.

# రష్యా దళాలకు ఉ.కొరియా ఊతం

*యుద్ధంలో ప్రత్యక్ష సాయం చేస్తున్నారంటూ ఉక్రెయిన్ ఆరోపణ*



ఉక్రెయిన్‌పై రష్యా చేస్తోన్న యుద్ధానికి ఉత్తరకొరియా బహిరంగంగా మద్దతిచ్చిన సంగతి తెలిసిందే. రష్యాకు కీలక ఆయుధాలను కూడా సరఫరా చేస్తున్నట్టు ఇటీవల వెల్లడైంది. ఈక్రమంలో తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. తమపై దాడులకు పాల్పడుతున్న రష్యా దళాలకు ఉత్తరకొరియా సైనికులు ప్రత్యక్షంగా సాయం చేస్తున్నారని ఉక్రెయిన్ ఆరోపించింది.

ఈమేరకు ఆ దేశ ఆర్మీ జనరల్ స్టాఫ్ ఫేస్‌బుక్‌లో ఓ ప్రకటన విడుదల చేసింది. రష్యాలో ఉన్న ఉత్తరకొరియా దళాలు సరిహద్దు దాటి తమ నిఘా కార్యకలాపాలు తెలుసుకునేందుకు డ్రోన్లను ఆపరేట్ చేస్తున్నాయని పేర్కొంది. ఉ.కొరియా యూనిట్లు ఇప్పుడు కుర్స్క్ ప్రాంతం నుంచి డ్రోన్లను ఆపరేట్ చేస్తున్నాయని తెలిపింది. తమ సైనిక స్థావరాలను కనుగొనడంతోపాటు సుమీ ప్రాంతంలో రాకెట్ దాడులకు పాల్పడుతున్న రష్యాకు సహాయపడుతున్నాయని వెల్లడించింది. ఉత్తరకొరియా డ్రోన్ ఆపరేటర్లు, రష్యా సైనిక సిబ్బంది మధ్య కమ్యూనికేషన్లను తమ దళాలు అడ్డుకున్నాయని స్పష్టం చేసింది. రష్యా చేస్తున్న యుద్ధానికి ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ బేషరుతుగా మద్దతు ప్రకటించారు. రెండు దేశాల మధ్య జరిగిన రక్షణ ఒప్పందంలో భాగంగా ఇరువురి మధ్య సైనిక సంబంధాలు తీవ్రంగా బలపడ్డాయి. గతేడాది కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ సేనలు చొచ్చుకురావడంతో.. నవంబర్‌లో దాదాపు 11,000 మంది సైనికులను కిమ్ ప్రభుత్వం పంపించింది. అందులో సుమారు 4,000 మంది వరకు యుద్ధభూమిలో చనిపోవడమో.. గాయపడటమో జరిగిందని వార్తా కథనాలు వెల్లడించాయి.

# వాళ్ల ఔషధాలు నాసిరకం

**భారత్, చైనాలపై అమెరికా సెనేటర్ ఆరోపణలు**



భారత్, చైనావంటి దేశాల నుంచి తాము దిగుమతి చేసుకొనే ఔషధాలు నాసిరకంగా ఉన్నాయంటూ అమెరికా సెనెటర్ జిమ్ బ్యాంక్స్ ఆరోపించారు. ఆయా దేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్న విదేశీ ఔషధ తయారీ తనిఖీలను వేగవంతం చేయాలని ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్‌ను కోరారు. ఎఫ్‌డీఏ కమిషనర్ మార్టిన్ మకారీకి రాసిన లేఖలో జిమ్ బ్యాంక్స్ విదేశీ ఔషధాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మందులపై నిర్లక్ష్యమైన పర్యవేక్షణ దేశ ప్రజలను ప్రమాదాల బారిన పడేసే అవకాశముందన్నారు. అమెరికా ఔషధ సరఫరాను రక్షించడానికి మరిన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. విదేశీ ఔషధ కర్మాగారాల్లో తనిఖీలు మరింత విస్తృతం చేయాలన్నారు. నాసిరకమైన ఔషధాలను తయారీ సమయంలోనే గుర్తించడంవల్ల వాటిని అమెరికాలోకి ప్రవేశించకముందే ఆపే అవకాశం ఉంటుందని అమెరికా సెనెటర్ తన లేఖలో పేర్కొన్నారు. ఇటీవల ఎఫ్‌డీఏ విడుదల చేసిన డేటా ప్రకారం.. అమెరికాలోకి వస్తున్న ఔషధాల్లో 39శాతం చైనా, 13 శాతం భారత్, 10శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతున్నాయి. అయితే ఆయా దేశాలనుంచి దిగుమతి అవుతున్న ఔషధాలను పూర్తిస్థాయిలో పరీక్షించట్లేదని జిమ్ బ్యాంక్స్ పేర్కొన్నారు. భారతీయ ఔషధ తయారీదారులు అత్యధికంగా 13 శాతం ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ ప్రాక్టీస్ సంస్థ తన నివేదికల్లో పేర్కొందన్నారు. అదేవిధంగా దేశీయంగా ఔషధాల తయారీకి మద్దతుగా ప్రీ చెక్ కార్యక్రమాన్ని నిర్వహించాలని జిమ్ బ్యాంక్స్ ఎఫ్‌డీఏను కోరారు. యూఎస్ ఆధారిత ఔషధ తయారీ సంస్థల ఆమోదం, సౌకర్యాలు, తనిఖీలను మరింత వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ దేశాల ఔషధ సరఫరా గొలుసులో పారదర్శకత, నాణ్యతను మెరుగుపరచడానికి ఆయా ఉత్పత్తిదారులు తీసుకుంటున్న చర్యలపై తనిఖీలు, పర్యవేక్షణవంటి వాటికి సంబంధించిన వివరణాత్మక సమాధానాల వివరాలతో నవంబర్ 7నాటికి ఎఫ్‌డీఏ ఓ నివేదిక పంపాలని ఆ లేఖలో పేర్కొన్నారు.



# తోమహాక్‌లు మీదపడాలని ఎవరూ కోరుకోరు!

**పుతిన్‌ను ఉద్దేశిస్తూ ట్రంప్ వ్యగ్యాస్త్రాలు**

*ఉక్రెయిన్– రష్యా మధ్య కొనసాగుతున్న యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను నయానో భయానో ఒప్పించాలని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. అందులోభాగంగా ఉక్రెయిన్‌కు దీర్ఘశ్రేణి తోమహాక్ క్షిపణులు 2,000 వరకు అందజేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. పుతిన్‌తో ఫోన్‌కాల్ నేపథ్యంలో ఈ విషయంపై స్వయంగా ఆయనతో చర్చించినట్టు తెలిపారు. పుతిన్‌తో ఫోన్‌కాల్ విషయంపై విలేకరుల సమావేశంలో ట్రంప్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు తోమహాక్‌లు అందించవద్దంటూ పుతిన్ మిమ్మల్ని కోరారా? అని ఓ రిపోర్టర్ ట్రంప్‌ను ప్రశ్నించారు. దీనికి బదులిస్తూ.. ఉక్రెయిన్‌కు దయచేసి తోమహాక్‌లు ఇవ్వండి. నేను దాన్ని అభినందిస్తున్నా' అని పుతిన్ అంటాడు అని మీరు అనుకుంటున్నారా? అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. అనంతరం మీ ప్రత్యర్థికి 2వేల తోమహాక్ క్షిపణులిస్తే మీకు అభ్యంతరం ఉంటుందా? అని తాను పుతిన్‌ను ప్రశ్నించానని తెలిపారు. దీనికి పుతిన్‌నుంచి బలమైన వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. 'నేను నిజంగా అలాగే అన్నాను. ఈ ఆలోచన పుతిన్‌కు నచ్చలేదు. తోమహాక్ అతి దారుణమైన, అతి విధ్వంసకర ఆయుధం. అలాంటి దీర్ఘశ్రేణి ఆయుధం తమపై కాల్పులు జరపాలని ఎవరూ కోరుకోరు' అని ట్రంప్ అన్నారు.*

*ట్రంప్‌తో ఫోన్‌కాల్‌లో ఈ తోమహాక్ క్షిపణుల గురించి పుతిన్ మాట్లాడారని క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషాకోవ్ పేర్కొ న్నారు. అవి ఉక్రెయిన్‌కు అందించడంతో.. అమెరికా– రష్యా సంబంధాలు దెబ్బతింటాయని పుతిన్ ఉద్ఘాటించినట్టు తెలిపారు. ఇక, పుతిన్‌తో అద్భుతమైన సంభాషణ జరిగిందంటూ ట్రంప్ ట్రూత్ సోషల్ వేదికగా వివరించారు. మరికొన్ని రోజుల్లో హంగరీ రాజధాని బుడాపెస్ట్‌లో పుతిన్‌తో భేటీ కానున్నట్టు తెలిపారు. ఇక్కడి చర్చల్లోనైనా రష్యా– ఉక్రెయిన్ల మధ్య యుద్ధం ముగింపునకు అడుగులు పడాలని భావిస్తున్నట్టు ట్రంప్ తెలిపారు.*

# వాళ్ల ధైర్యానికి సంతోషమేసింది

**- భారత మహిళా జర్నలిస్టులపై యూఎస్ కాంగ్రెస్ ప్రశంస**



ఇటీవల భారత్‌కు వచ్చిన అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఆమిరాఖాన్ ముత్తాఖీ ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఉద్దేశపూర్వకంగానే మహిళలు పాల్గొనకుండా నిషేధం విధించారంటూ విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. అనంతరం ఆయనే స్వయంగా తన ప్రెస్‌మీట్‌కు రావాల్సిందిగా మహిళా జర్నలిస్టులను ఆహ్వానించారు. దీనిపై తాజాగా అమెరికా కాంగ్రెస్ సభ్యురాలు సిడ్నీ కామేజర్ డోవ్ ఎక్స్‌లో పోస్టు చేశారు. మహిళల సమాన హక్కుల కోసం ఎదురొడ్డి నిలబడిన జర్నలిస్టులను చూస్తే సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. కామేజర్ డోవ్ భారత్‌లోని మహిళా జర్నలిస్టులను ప్రశంసిస్తూ.. భారత్‌కు చెందిన మహిళా జర్నలిస్టులు తమ సమాన హక్కుల కోసం ధైర్యంగా పోరాడారన్నారు. నిజాన్ని నిర్భయంగా చాటిచెప్పేందుకు వారు తాలిబన్ నేత ముందు గర్వంగా నిలబడడం చూస్తే సంతోషంగా ఉందని రాసుకొచ్చారు. తాలిబన్లు నిర్వహించే కార్యక్రమాల్లో అఫ్గాన్ మహిళలపై నిషేధం విధించడాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా ఎప్పుడూ తన గళాన్ని వినిపిస్తుందని అన్నారు.

**ముత్తాఖీ భారత్ పర్యటన..**

ఇటీవల అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఆమిరాఖాన్ ముత్తాఖీ భారత పర్యటనకు వచ్చారు. ఆ సమయంలో ఢిల్లీలోని అఫ్గానిస్థాన్ ఎంబసీలో ముత్తాఖీ నిర్వహించిన మీడియా సమావేశంలో ఒక్క మహిళ కూడా కనిపించలేదు. దీంతో అందులో మహిళా జర్నలిస్టులు పాల్గొనకుండా అడ్డుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ విషయాన్ని వెల్లడిస్తూ కొందరు మహిళా పాత్రికేయులు సోషల్ మీడియా ద్వారా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఘటనను ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, మహిళా జర్నలిస్టులకు సంబంధించిన సంస్థ ఐడబ్ల్యూపీసీ కూడా ఖండించాయి. ముత్తాఖీ పాల్గొన్న మీడియా సమావేశంలో తాము ఉద్దేశపూర్వకంగా మహిళలను మినహాయించలేదని తాలిబన్ అధికారి వెల్లడించారు. మహిళలపై తమకు ఎలాంటి వివక్ష లేదని, పాస్‌లసంఖ్య పరిమితంగా ఉండడంతో కొందరినే ఆహ్వానించామన్నారు.

**కలిసివచ్చినా.. విడివిడిగా వచ్చినా..**

# ద్విముఖ యుద్ధానికి మేం సిద్ధం

**- భారత్, అఫ్గాన్‌లపై పాక్ రక్షణమంత్రి ప్రేలాపన**



భారత్‌పై పాకిస్థాన్ మరోసారి పిచ్చి ప్రేలాపనలకు దిగింది. భారత్‌కు అఫ్గానిస్థాన్ దగ్గరవడం జీర్ణించుకోలేక అక్కసు వెళ్లగక్కుతోంది. సరిహద్దువెంట భారత్ డర్టీ గేమ్స్ ఆడేందుకు అవకాశాలున్నాయని దాయాది రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేశారు. తాలిబన్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు నెలకొన్న వేళ.. ఖ్వాజా ఆసిఫ్ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడారు. భార్‌తోకూడా సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రమైతే ఎలా? అని మంత్రికి ప్రశ్న ఎదురుకాగా... "అవును.. దానిని కొట్టిపారేయలేం. ద్విముఖ యుద్ధానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉంది. అందుకు మావద్ద వ్యూహాలున్నాయి. వాటిగురించి నేను చర్చించను" అని చెప్పారు. అప్పుడే భారత్ గురించి నోరుపారేసుకున్నారు. అలాగే తమ దేశంలో నివసిస్తోన్న అఫ్గాన్ శరణార్థులను లక్ష్యంగా చేసుకున్నారు. "వారివల్ల పాక్‌కు ఎలాంటి ఉపయోగం లేకపోగా.. వారు ఉగ్రవాద చర్యలకు పాల్పడుతున్నారు. పాక్‌లో అక్రమంగా నివసిస్తోన్న వారిని గుర్తిస్తున్నాం. వారు వెంటనే మా దేశాన్ని వీడాలి" అని వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్– అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఇరుదేశాల బలగాలు పలుచోట్ల పరస్పరం దాడులకు దిగిన సంగతి తెలిసిందే. దాంతో ఇరువైపులా ప్రాణనష్టం సంభవించింది. పాక్‌పై దాడులు ప్రారంభమైనపుడు అఫ్గాన్ విదేశాంగ మంత్రి ఢిల్లీలోనే ఉన్నారని, భారత ఆదేశాల మేరకే తమపై దాడులు జరిగాయని పాక్ ఆరోపిస్తోంది. భారత్ తరపున అఫ్గానిస్థాన్ తమపై పరోక్షయుద్ధం చేస్తోందని పాకిస్థాన్ రక్షణమంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఆరోపణలు చేశారు. వీటికి భారత్ ప్రభుత్వం స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. "పాక్ ఉగ్రవాద సంస్థలకు ఆతిథ్యమిచ్చి వారి కార్యకలాపాలను ప్రోత్సహిస్తోంది. తన అంతర్గత వైఫల్యాలకు పొరుగువారిని నిందించటం ఆ దేశానికున్న అలవాటు. అఫ్గానిస్థాన్ తన సొంత భూభాగాలపై సార్వభౌమత్వాన్ని చెలాయించడం పాక్‌కు కోపం తెప్పిస్తోంది" అని భారత విదేశాంగశాఖ మండిపడింది.

# నిరాశపర్చిన తిలక్ వర్మ

## - ఢిల్లీతో రంజీ మ్యాచ్‌లో డకౌట్



ఢిల్లీతో జరుగుతున్న రంజీ ట్రోఫీ 2025-26 ఎలైట్ గ్రూపు మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఆసియా కప్ హీరో, హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ తీవ్ర నిరాశపరిచాడు. కీలక సమయంలో బ్యాటింగ్‌కు వచ్చిన తిలక్.. రెండు బంతులు ఎదుర్కొని ఖాతా తెరవకుండానే పెవిలియన్‌కు చేరాడు. ఢిల్లీ కెప్టెన్ అయూష్ బదోని బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు. తిలక్ విఫలమైనప్పటికీ హైదరాబాద్ బ్యాటర్లు ఢిల్లీకి ధీటైన జవాబు ఇచ్చేందుకు పోరాడుతున్నారు. మూడోరోజు శుక్రవారం ఆట ముగిసేసరికి హైదరాబాద్ జట్టు 7 వికెట్ల నష్టానికి 400 పరుగులు చేసింది. ఢిల్లీ తొలి ఇన్నింగ్స్ స్కోరు 529/4- డిక్లేర్డ్‌కు హైదరాబాద్ ఇంకా 129 పరుగులు వెనుకబడి ఉంది. తన్మయ్ అగర్వాల్ (132), అలెగాని వరుణ్‌గౌడ్ (57) రాణించారు. రాహుల్ రాధేష్ 41 పరుగులతో క్రీజులో ఉన్నాడు. మ్యాచ్‌కు శనివారం ఆఖరిరోజు. ఫలితం తేలే అవకాశం లేదు. అయితే ఢిల్లీ జట్టుకు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కే అవకాశాలు ఎక్కువగా కనపడుతున్నాయి. ఢిల్లీ కెప్టెన్ ఆయుష్ బదోనీ ఐదు వికెట్లతో హైదరాబాద్ పతనాన్ని శాసించాడు. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ తమ తొలి ఇన్నింగ్సును 4 వికెట్ల నష్టానికి 529 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది.

**పాటిదార్ డబుల్ సెంచరీ..**



దేశవాళీ క్రికెట్లో మధ్యప్రదేశ్ కెప్టెన్, టీమిండియా ఆటగాడు రజత్ పాటిదార్ తన సూపర్ ఫామును కొనసాగిస్తున్నాడు. రంజీ ట్రోఫీ 2025-26 సీజన్లో భాగంగా ఇండోర్ వేదికగా పంజాబ్‌తో జరుగుతున్న మ్యాచ్లో పాటిదార్ డబుల్ సెంచరీతో చెలరేగాడు. పాటిదార్ 330 బంతుల్లో 26 ఫోర్ల సాయంతో తొలి ఫస్ట్ క్లాస్ డబుల్ సెంచరీ మార్కు అందుకున్నాడు. 107 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో తన ఇన్నింగ్సును ప్రారంభించిన పాటిదార్ ఆచితూచి ఆడుతూ మూడంకెల ఫిగర్‌ను సాధించాడు. ఇప్పటివరకు అతడి అత్యధిక వ్యక్తిగత స్కోర్ 196గా ఉండేది. మూడోరోజు శనివారం ఆట ముగిసేసరికి మధ్యప్రదేశ్ 8 వికెట్ల నష్టానికి 519 పరుగులు చేసి 287 పరుగుల కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. పాటిదార్ (205), అర్షద్ ఖాన్ (60) క్రీజులో ఉన్నారు. అంతకుముందు పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 232 పరుగులకు ఆలౌట్ అయింది.

**పటిష్టస్థితిలో ఆంధ్ర**

ఉత్తరప్రదేశ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు పటిష్ట స్థితిలో నిలిచింది. మూడోరోజు ఆట ముగిసేసరికి ఉత్తరప్రదేశ్ 6 వికెట్ల నష్టానికి 294 పరుగులు చేసింది. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంకా 176 పరుగులు వెనుకబడిఉంది. రింకుసింగ్ (82), విప్రాజ్ నిగం (28) క్రీజులో ఉన్నారు. శనివారం ఆటకు చివరిరోజు. మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో ఆంధ్ర జట్టుకు కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

**తమిళనాడు విలవిల**

జార్ఖండ్‌తో జరుగుతున్న రంజీ మ్యాచ్‌లో తమిళనాడు విలవిలలాడుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో 93 పరుగులకే కుప్పకూలిన తమిళనాడు రెండో ఇన్నింగ్స్‌లోనూ మూడు వికెట్లు కోల్పోయి 52 పరుగులు మాత్రమే చేసింది. ఇన్నింగ్స్ ఓటమిని తప్పించుకోవాలంటే తమిళనాడుకు ఇంకా 275 పరుగులు కావాలి. అంతకు ముందు ఇషాన్ కిషన్ (173) భారీ శతకంతో జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 413 పరుగులు చేసింది. సాహిల్ రాజ్ (77) కూడా రాణించాడు. తొలి ఇన్నింగ్స్‌లో సాహిల్ రాజ్ (4), జతిన్ పాండే (5) ధాటికి తమిళనాడు బ్యాటర్లు చేతులెత్తేశారు. అంబరీష్ (28), హెమచూడేశన్ (14), గుర్జప్‌నీత్ సింగ్ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. టీమిండియా టెస్ట్ జట్టుకు ఎంపికైన నారాయణ్ జగదీశన్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ (3, 21) నిరాశ పరిచాడు.

# వన్డే వరల్డ్ కప్‌లో కోహ్లి, రోహిత్ ఆడతారు




టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ కచ్చితంగా 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడతారని ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్ తో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి తిరిగి మైదానంలోకి అడుగుపెడుతున్నారు. దీంతో అందరి కళ్లూ వారిపైనే ఉన్నాయి. దాదాపు ఆరేడు నెలల తర్వాత వన్డే మ్యాచ్‌లె ఆడేందుకు స్టార్లు ఇద్దరూ సిద్ధమయ్యారు. ఆస్ట్రేలియాతో ఆదివారం మొదటి మ్యాచ్ జరగనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగిన ప్రెస్ కాన్ఫరెన్సలో భారత్ నుంచి అక్షర్ పటేల్, ఆసీస్ తరపున ట్రావిస్ హెడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోహ్లి, రోహిత్ వచ్చే వన్డే ప్రపంచ కప్ లో ఆడతారని భావిస్తున్నట్లు హెడ్ వ్యాఖ్యానించాడు. రోహిత్, విరాట్ భారత్ కోసం అద్భుతాలు చేశారు. నా కంటే అక్షర్ పటేల్ బాగా చెప్పగలడు. ఇద్దరూ ప్రపంచ క్రికెట్లో అత్యుత్తమ ప్లేయర్లు. వారిని ఒకరితో మరొకరిని పోల్చడం సరికాదు. పరిమిత ఓవర్ల క్రికెట్లో దూకుడుగా ఓపెనింగ్ చేసే రోహిత్ అంటే నాకు చాలా గౌరవం. అయితే, వారిద్దర్నీ ఏదో ఒక దశలో మిస్ అవుతామని తెలుసు. కానీ, 2027 వన్డే ప్రపంచ కప్లో ఆడేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఉన్నారు. తప్పకుండా ఆడతారని భావిస్తున్నా. దాని వల్ల ఆట మరింత గొప్పగా మారుతుందని హెడ్ తెలిపాడు.

దీనికి అక్షర్ స్పందిస్తూ వారిద్దరూ తప్పకుండా వన్డే ప్రపంచ కప్‌లో ఆడతారన్నాడు. రోహిత్, విరాట్ ప్రపంచ స్థాయి అత్యుత్తమ ప్లేయర్లు. ఏం చేయాలో వారికి బాగా తెలుసు. తప్పకుండా సిద్ధంగా ఉంటారు. ఒకవేళ వారి ఫామ్ గురించి మాట్లాడాలనుకుంటే.. అందుకు కూడా వారు రెడీ. ఇప్పటికే ఫిటెనెస్ టెస్టులోనూ పాస్ అయిపోయారు. ఫామ్లోకి రావడం వారికేమీ కొత్త కాదని అక్షర్ విశ్లేషించాడు.

# నా ఫస్ట్ క్రష్ ధోనీ



టాలీవుడ్ హీరోయిన్ కీర్తి సురేష్ గురించి సినీ లవర్స్ కు ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. నేను శైలజ సినిమాతో తెలుగు తెరకు పరిచయమై.. తర్వాత అనేక సినిమాల్లో నటించిన కీర్తి.. తనకంటూ ప్రత్యేక ఫ్యాన్ ఫాలోయింగ్ ను సంపాదించింది. ఇటీవలే వివాహం చేసుకుని కొత్త జీవితంలోకి అడుగు పెట్టింది. ఇది ఇలా ఉంటే.. తాజాగా టాలీవుడ్ టాప్ యాక్టర్ జగపతి బాబు హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'జయమ్ము నిశ్చయమ్మురా' అనే ఓటీటీ టాక్‌షోలో కీర్తి సురేష్ పాల్గొన్నారు. ఈ క్రమంలో ఫేవరెట్ క్రికెటర్ గురించి కీర్తిని హోస్ట్ జగపతి బాబు ప్రశ్నించగా.. టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తన ఫేవరేట్ క్రికెటర్ అని తెలిపింది. ధోనీ అంటే చాలా ఇష్టమని, ఆయనే తన మొదటి క్రష్ అని పేర్కొంది. చిన్ననాటి నుంచి ధోనీని ఆరాధిస్తున్నానని, ఆయన లాంటి వ్యక్తినే పెళ్లి చేసుకోవాలనే కోరిక కూడా ఉండేదని ఈ బ్యూటీ చెప్పుకొచ్చింది. గతంలో ఓ ఇంటరాక్టివ్ సెషన్‌లోనూ అభిమాన క్రికెటర్ గురించి ఓ ఫ్యాన్ ప్రశ్నించగా.. ధోనీ పేరును చెబుతూ 'తమ్బి, నమ్మ 7 ఎల్లప్పుడూ!'అని పేర్కొంది. ధోనీ జెర్సీ నెంబర్ 7 అన్న సంగతి అందరికీ తెలిసిందే.

ఇక కీర్తి సురేష్ సినిమాల విషయానికి వస్తే.. తెలుగులో విజయ్ దేవరకొండ సరసన రౌడీ జనార్దన్ చిత్రంలో నటిస్తోంది. తమిళ చిత్రాలు రివాల్వర్ రీటా, కన్నెవీడి వంటి ప్రాజెక్ట్‌లతో ఈ బ్యూటీ బిజీగా ఉంది. గతేడాది డిసెంబర్‌లో తన చిన్ననాటి స్నేహితుడు, వ్యాపారవేత్త అయిన ఆంటోనీ తట్టిల్‌ను కీర్తి సురేష్ లవ్ మ్యారేజ్ చేసుకుంది. పెళ్లి తర్వాత కూడా ఆమె సినిమాల్లో నటిస్తోంది. మహానటి సినిమాతో కీర్తికి ఉత్తమ నటిగా జాతీయ అవార్డ్ వరించింది.

# అరుదైన ఘనతకు అడుగుదూరంలో...



ఆస్ట్రేలియా పర్యటనకు ముందు టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీని ఆల్‌టైమ్ రికార్డ్ ఊరిస్తోంది. ఈ నెల 19 నుంచి ఆసీస్ తో ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌లో కోహ్లీ సెంచరీ సాధిస్తే ఇంటర్నేషనల్ క్రికెట్‌లో ఏదైనా ఒక ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు చేసిన బ్యాటర్‌గా చరిత్ర సృష్టిస్తాడు. ఇప్పటికే ఈ రికార్డ్‌ను సమం చేసిన కోహ్లీ.. అధిగమించేందుకు ఒక్క సెంచరీ దూరంలో ఉన్నాడు. ఆదివారం పెర్త్ వేదికగా జరిగే తొలి వన్డేలో కోహ్లీ సెంచరీ చేస్తే.. ఈ అరుదైన రికార్డ్ అతడి ఖాతాలో పడనుంది. ప్రస్తుతం ఈ జాబితాలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, కోహ్లి సమంగా ఉన్నారు. సచిన్ టెస్ట్‌ల్లో 51 సెంచరీలతో టాప్‌లో ఉండగా విరాట్ కోహ్లీ.. 51 వన్డే సెంచరీలతో ఈ రికార్డ్‌ను సమం చేశాడు. ఆ తర్వాత సచిన్ వన్డేల్లో 49, జాక్వస్ కల్లీస్ టెస్ట్‌ల్లో 45 , రికీ పాంటింగ్ టెస్టుల్లో 41 శతకాలతో కొనసాగుతున్నారు.


అయితే మూడు ఫార్మాట్లలో మాత్రం 100 సెంచరీలతో సచిన్ టాప్ ప్లేసులో ఉన్నాడు. ఆ తర్వాత 82 సెంచరీలతో కోహ్లీ రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఆసీస్ తో జరిగే వన్డే సిరీస్‌లో కోహ్లీ సెంచరీ చేస్తే.. ఆస్ట్రేలియా గడ్డపై అత్యధిక సెంచరీలు చేసిన విదేశీ బ్యాటర్‌గా కూడా విరాట్ నిలుస్తాడు. ఆస్ట్రేలియా గడ్డపై ఆ దేశంతో 5 శతకాలతో శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కర, హిట్ మ్యాన్ రోహిత్ శర్మతో కోహ్లి సమంగా ఉన్నాడు. మరో సెంచరీ చేస్తే వారిని కోహ్లీ అధిగమిస్తాడు.

# భారత్-పాక్ మ్యాచ్‌కు రికార్డు స్థాయి వీక్షణలు



మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ రికార్డు స్థాయి వ్యూయర్ షిప్ సాధించింది. ఆ టోర్నీలో టీమ్ ఇండియా రెండు మ్యాచుల్లో గెలిచి.. మరో రెండు మ్యాచుల్లో ఓడింది. ఆదివారం కఠిన మైన ఇంగ్లాండ్‌తో తలప డేందుకు సిద్ధమవుతోంది. అయితే, ఇప్పటివరకు జరిగిన మ్యాచుల్లో భారత్- పాకిస్థాన్ పోరు హైలైట్‌గా నిలిచింది. ఆ మ్యాచ్‌ను రికార్డు స్థాయిలో అభిమానులు వీక్షించడం గమనార్హం. అంతకుముందు ఆసియా కప్‌లో పురుషుల టీములు మూడుసార్లు తలపడిన సంగతి తెలిసిందే.దీంతో మహిళల మధ్య మ్యాచ్ ఎలా సాగుతుందోనని ఫ్యాన్స్ ఆసక్తిగా చూసినట్లు క్రికెట్ వర్గాలు తెలిపాయి. తాజాగా మహిళల వరల్డ్ కప్‌లోని కొన్ని మ్యాచుల వీక్షణలను ఐసీసీ, జియో హాట్ స్టార్ విడుదల చేసింది.

శ్రీలంకతో భారత్ పోరు నుంచి అభిమానులు ఎక్కువగా వరల్డ్ కప్ మ్యాచులు వీక్షించడం మొదలైంది. తొలి 13 మ్యాచులకు దాదాపు 60 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఇందులో భారత్- పాక్, భారత్ - ఆస్ట్రేలియా మ్యాచ్‌కు సంబంధించిన గణాంకాలూ ఉన్నాయి. భారత్ పాకిస్థాన్ మ్యాచ్‌ను దాదాపు 28.4 మిలియన్ల వ్యూయర్లు వీక్షించారు. నిమిషాలపరంగా 1.87 బిలియన్ మినిట్స్ నమోదు కావడం గమనార్హం. ఇది మహిళల క్రికెట్లో సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత భారత్ -ఆస్ట్రేలియా మ్యాచ్‌ను కూడా ఫ్యాన్స్ ఆసక్తిగా చూశారు. ఈ మ్యాచ్లో భారత్ ఓడినప్పటికీ పోరాటం మాత్రం బాగుంది. దీంతో 4.8 మిలియన్ల వ్యూయర్‌షిప్ వచ్చింది. లీగ్ స్టేజ్లో భారత్ ఇంకా మూడు మ్యాచులు ఆడనుంది. అందులో ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌తో తలపడనుంది. సెమీస్ కు చేరుకోవాలంటే భారత్‌కు ప్రతి మ్యాచ్ ఫలితం కీలకం. దీంతో వ్యూయర్ షిప్ పరంగా మరిన్ని రికార్డులు నమోదవుతాయని క్రికెట్ విశ్లేషకుల అంచనా.





# దెయ్యాలతో 'జటాధర' ఆట

హీరో సుధీర్‌బాబు నుంచి రానున్న లేటెస్ట్ చిత్రం 'జటాధర'. ప్రేక్షకుల్లో నెలకొన్న ఆసక్తికి ఇప్పుడొచ్చిన ట్రైలర్ రెట్టింపు చేసింది. సినిమాను వెంకట్ కళ్యాణ్, అభిషేక్ జైస్వాల్ సంయుక్తంగా డైరెక్ట్ చేస్తుంటే.. పూర్తి సూపర్ న్యాచురల్ థ్రిల్లర్ మూవీగా ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అవుతోంది. సినిమా నుంచి మేకర్స్ తాజాగా ట్రైలర్ రిలీజ్ చేశారు.

ట్రైలర్ ఆద్యంతం సూపర్ న్యాచురల్ అంశాలతో మెస్మరైజ్ చేస్తోంది. దెయ్యాలను వేటాడే హీరో.. అతని చుట్టూ జరిగే ధనపిశాచి ఆట.. ఈ క్రమంలో చోటుచేసుకునే థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలగలిపి సినిమా కథగా మన ముందుకు రానుంది.

ఇక ట్రైలర్‌లోని గ్రాఫిక్స్, విజువల్స్ సూపర్. ముఖ్యంగా సినిమాలో బాలీవుడ్ బ్యూటీ సోనాక్షి సిన్హా సరికొత్త పాత్రలో ప్రేక్షకులను మెస్మరైజ్ చేసేందుకు సిద్ధమైంది. ఈ సినిమాతో ఆమె టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఇక సినిమాకు రాజీవ్ రాజ్ బీజీఎం వర్క్ ప్లస్‌పాయింట్ కానున్నట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. మరి ఇలాంటి థ్రిల్లింగ్ సూపర్ న్యాచురల్ కథతో వస్తున్న సుధీర్ బాబు బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తాడా? అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. సినిమాలో దివ్య ఖోస్లా, శిల్పా శిరోద్కర్, రాజీవ్ కనకాల, శుభలేఖ సుధాకర్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు.

# విజయ్ దగ్గరికి విక్రమ్ స్టోరీ



హీరో విజయ్ దేవరకొండ రెండు సినిమాలతో ప్రస్తుతం బిజీ. వీటిలో రాహుల్ సాంకృత్యన్ డైరెక్షన్‌లో రూపొందుతున్న సినిమా ఇప్పటికే చిత్రీకరణ ప్రారంభించుకోగా.. దర్శకుడు రవికిరణ్ కోలాతో చేయనున్న 'రౌడీ జనార్దన' ఇటీవలే లాంఛనంగా మొదలైంది. అయితే.. రెండు సినిమాలు ఇంకా పట్టాలమీద ఉండగానే.. విజయ్ దగ్గరకు మరో కథ వచ్చిందట. దీన్ని 'మనం', '24'లాంటి విజయవంతమైన సినిమాలతో మెప్పించిన దర్శకుడు విక్రమ్ కె కుమార్ తీసుకొచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం ఈ కథా చర్చలు కొనసాగుతున్నాయని.. పూర్తి స్క్రిప్ట్ వినిపించాక అధికారిక ప్రకటన వెలువడే అవకాశముందని తెలిసింది. అన్నీ అనుకున్నట్టు జరిగితే యూవీ క్రియేషన్స్ సంస్థ దీన్ని నిర్మించనుంది. నిజానికి ఈ బ్యానర్‌లో విక్రమ్ కుమార్ నితిన్ కలయికలో ఓ చిత్రం పట్టాలెక్కాల్సి ఉంది. ఇప్పుడీ ప్రాజెక్ట్ విజయ్ చేతిలోకి వచ్చినట్టు ప్రచారం సాగుతోంది. దీనిపై పూర్తి స్పష్టత రావాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడక తప్పదు.

# హాలీవుడ్ ఈవెంట్‌లో రామాయణ ట్రైలర్?

బాలీవుడ్ సినిమాగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కిస్తున్న చిత్రమే "రామాయణ". బాలీవుడ్ సూపర్ స్టార్ రణబీర్‌కపూర్ హీరోగా సాయిపల్లవి హీరోయిన్‌గా దర్శకుడు నితేష్ తివారి తెరకెక్కిస్తున్న భారీ విజువల్ వండర్‌పై మంచి అంచనాలున్నాయి. ఆమధ్య వచ్చిన గ్లింప్స్‌తోనే సాలిడ్ రెస్పాన్స్ వచ్చింది. ఇక ఈ సినిమా గ్లోబల్‌గానూ ఆకట్టుకుంటుందని అంతా నమ్ముతున్నారు. అయితే ఓ క్రేజీ బజ్ ఈ సినిమాపై ఇప్పుడు వినిపిస్తుంది. దీని ప్రకారం రామాయణ ట్రైలర్‌కి ఆల్రెడీ ముహూర్తం ఫిక్స్ చేసినట్టు తెలుస్తుంది. అందుకోసం మేకర్స్ గ్లోబల్ వేదిక ఎంచుకున్నారట. ప్రముఖ హాలీవుడ్ ఈవెంట్ కామిక్ కాన్ ఈవెంట్‌లో వచ్చే ఏడాది జూలైలో ఈ




ట్రైలర్‌ని లాంచ్ చేయనున్నట్టుగా ఇపుడు వినిపిస్తుంది. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది తెలియాల్సి ఉంది. ఇక ఈ చిత్రంలో యష్, సన్నీడియోల్, కాజల్ అగర్వాల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'చాప్టర్' తిరగరాశాడుగా..!



కలెక్షన్ల విషయంలో 'కాంతార చాప్టర్ 1' రికార్డులు సృష్టిస్తోంది. తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. రెండు వారాల్లో ప్రపంచవ్యాప్తంగా రూ.717 కోట్లకు పైగా (గ్రాస్) వసూలు చేసినట్టు నిర్మాణ సంస్థ హొంబలే ఫిల్మ్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది.

ఇందులో తెలుగు రాష్ట్రాలనుంచి రూ.105 కోట్లకుపైగా రాబట్టినట్టు సినీవర్గాలు తెలిపాయి. ఇప్పటివరకూ అత్యధిక కలెక్షన్లు రాబట్టిన కన్నడ చిత్రాల జాబితాలో 'కాంతార 1' ప్రస్తుతానికి రెండోస్థానంలో ఉంది. రూ.1200 కోట్లుం కలెక్షన్లతో 'కేజీయఫ్-2' తొలి స్థానంలో నిలిచింది. 'కాంతార చాప్టర్ 1' ఈనెల 2న విడుదలైన సంగతి తెలిసిందే. రిలీజ్ రోజే అత్యధిక వసూలు (రూ.89 కోట్లుం) చేసిన కన్నడ సినిమాగా నిలిచింది. 24 గంటల్లో.. 'బుక్ మై షో'లో 1.28 మిలియన్లకిపైగా టికెట్లు అమ్ముడుపోయాయి. ఈ పోర్టల్ వేదికగా ఈ ఏడాదిలో ఈ రేంజ్‌లో టికెట్లు సేల్ కావడం విశేషం.

## నితిన్‌కు కథలు నచ్చట్లే!



హీరో నితిన్ ఇటీవల నటించిన 'రాబిన్‌హుడ్', 'తమ్ముడు' సినిమాలు భారీనిరాశ మిగిల్చాయి. దీంతో వరుస ఫెయిల్యూర్స్ తర్వాత ఆయన తన నెక్స్ట్ ప్రాజెక్ట్‌పై చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు. తొలుత వేణు యెల్దండితో 'ఎల్లమ్మ'చిత్రం చేయాలని భావించాడు. తర్వాత విక్రమ్ కె. కుమార్‌తో స్పోర్ట్స్ డ్రామా చేయాలని అనుకున్నా, ఇప్పుడు వాటినుంచి తప్పుకున్నట్టు సమాచారం. ఇదే సమయంలో 'లిటిల్ హార్ట్స్' దర్శకుడు సాయిమార్తాండ్ నితిన్‌కు ఒక లవ్ స్టోరీ వినిపించాడట. కానీ, నితిన్ వీరెవరికీ కూడా ఓకే చెప్పలేదట. ఇక ఇప్పుడు దర్శకుడు విఐ ఆనంద్‌తో నితిన్ కథా చర్చల్లో ఉన్నాడు. అలాగే శ్రీను వైట్ల కూడా అతడిని కలిసారని టాక్. అయితే ఇప్పటివరకు నితిన్ ఏ ప్రాజెక్ట్‌కీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. మరి నితిన్ ఎవరికి తన నెక్స్ట్ చిత్రం బాధ్యతలు అప్పగిస్తాడా? అనేది ఆసక్తికరంగా మారింది.

# ఓటీటీకి కిష్కింధపురి



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా, అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా దర్శకుడు కౌశిక్ పెగళ్ళపాటి తెరకెక్కించిన సాలిడ్ హారర్ థ్రిల్లర్ హిట్ 'కిష్కింధపురి'. నటుడు, డాన్స్‌మాస్టర్ శాండీ విలన్‌గా నటించిన చిత్రానికి ఆడియెన్స్‌నుంచి మంచి మార్కులు వచ్చాయి. ఇలా థియేటర్స్‌లో అలరించిన ఈ చిత్రం ఫైనల్‌గా ఓటీటీలో స్ట్రీమింగ్‌కి వచ్చేసింది. మరి ఈ చిత్రాన్ని జీ5 సొంతం చేసుకోగా అందులో నేటినుంచి అందుబాటులోకి వచ్చేసింది. ఈ సినిమాని అప్పుడు మిస్ అయ్యినవారు ఇప్పుడు తప్పకుండ ఓటీటీలో ట్రై చేయవచ్చు. ఇక ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ్ సంగీతం అందించగా సాహు గారపాటి నిర్మాణం వహించారు.

# బిగ్ బాస్‌కి.. మాస్‌జాతర

రవితేజ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'మాస్ జాతర' కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు భాను బోగవరపు డైరెక్ట్ చేస్తుండగా ఔట్ అండ్ ఔట్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను రూపొందిస్తున్నారు. అక్టోబర్ 31న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది. ఈ క్రమంలో చిత్ర ప్రమోషన్స్‌ను మొదలుపెట్టేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా బుల్లితెరపై దూసుకెళ్తున్న బిగ్ బాస్ తెలుగు సీజన్ 9లో 'మాస్ జాతర' టీమ్ సందడి చేయబోతున్నట్టు తెలుస్తోంది. దీపావళి ట్రీట్‌గా ఈ వీకెండ్‌లో బిగ్‌బాస్ హౌజ్‌లో మాస్ జాతర టీమ్ సందడి చేయనుంది. దీంతో అక్కినేని నాగార్జునతో రవితేజ ఎలాంటి సందడి చేయబోతున్నాడా? అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక మాస్ జాతర చిత్రంలో యంగ్ బ్యూటీ శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.

